మంగళవారం
15-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 114
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేటి నుంచి పాక్‌లో 'ఎస్‌సీఓ' సదస్సు

ఇస్లామాబాద్: షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీఓ)కు పాకిస్థాన్ ఆతిథ్యమిస్తోంది. ఈనెల 12-16 తేదీల్లో జరగబోయే అంతర్జాతీయ సదస్సుకు రాజధాని ఇస్లామాబాద్ ముస్తాబైంది. ఎస్‌సీఓ సదస్సు కోసం గట్టి భద్రతా ఏర్పాట్లు జరిగాయి. ఇస్లామాబాద్, రావల్పిండిలో మెట్రో బస్సు సేవలు నిలిపివేయడమే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వాణిజ్య కేంద్రాలకు పాకిస్థాన్ ప్రభుత్వం మూడు రోజుల సెలవు ప్రకటించింది. విదేశీ ప్రతినిధులు తిరిగే మార్గాల్లో కబేలు, జిమ్‌లు, వివాహ వేదికలు, మార్కెట్లు అన్నింటినీ మూసివేయాలని ఆదేశించింది. భారత్ నుంచి నలుగురు, 76 మంది రష్యా ప్రతినిధులు, ఎస్‌సీఓ ప్రతినిధులు ఏడుగురు, చైనా నుంచి 15 మంది, కిర్గిస్తాన్ నుంచి నలుగురు, ఇరాన్ నుంచి ఇద్దరు చొప్పున విదేశీ ప్రతినిధులు ఇప్పటికే ఇస్లామాబాద్ చేరుకున్నారు.

ముంచెత్తిన వర్షం

ఐదు జిల్లాలు అతలాకుతలం

- అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన కలెక్టర్లు
- ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష
- మెసేజ్‌లతో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విశాఖ జిల్లాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి జోరు వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఇందుకూరిపేట, కోవూరు, కొడవలూరు మండలాల్లో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. నెల్లూరు,

- మిగతా 2 లో

క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్, ఐపీఎస్‌లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఐఏఎస్‌ల విభజన వ్యవహారం కొలిక్కిరాలేదు. ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్‌లు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవల డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) జారీచేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన వేర్వేరుగా పిటిషన్లు వేశారు. తెలంగాణలోనే తమను కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి

- మిగతా 2 లో

అమిత్ షా నోరు విప్పరేం

సిద్దిఖీ హత్యపై రాజా

న్యూఢిల్లీ: మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్‌సీపీ నేత బాబా సిద్దిఖీ హత్యపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మౌనాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. రాజా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సిద్దిఖీ హత్యపై ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దిఖీ హత్య ఆందోళన కలిగించే అంశమని, ముంబై పరిణామాలు బాధాకరమని ఆయన అన్నారు. సిద్దిఖీ హత్యకు జైల్లో ఉన్న వారు ఎలా బాధ్యత వహిస్తారు? దీనిపై అమిత్ షా ఎందుకు మౌనం వహిస్తున్నారు? మహారాష్ట్రలో జరిగే నేరాలపై ఆయన స్పందించరేం? అని నిలదీశారు. సిద్దిఖీ హత్య, మహారాష్ట్రలో నేరాలపై అమిత్‌షా స్పందించాలని రాజా డిమాండ్ చేశారు. బాబా సిద్దిఖీ ఈనెల 12న హత్యకు గురైన విషయం తెలిసిందే.

అమరావతిలో 'టాటా' ఇన్నోవేషన్ హబ్

- మరో ఐదు ప్రాంతాల్లో అనుబంధ కేంద్రాలు
- ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పారిశ్రామిక విధానం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా వ్యాపారవేత్తలకు ఐదు శాతం ప్రోత్సాహం: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇటీవల మృతిచెందిన పారిశ్రామిక వేత్త రతన్ టాటా పేరున అమరావతిలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి దోహదపడేలా టాటా పేరుతో హబ్ తీసుకురావాలని గత మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికనుగుణంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హబ్‌కు అనుంబంధంగా రాష్ట్రంలోని మరో ఐదు ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఒక్కో కేంద్రానికి ఒక్కో బహుళజాతి కంపెనీ మెంటార్‌గా ఉండేలా డిజైన్ చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్‌ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ ముసాయిదా విధానాలపై సోమవారం సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

- మిగతా 2 లో

ఆర్థిక అసమానతలపై పరిశోధనకు 'నోబెల్'

స్టాక్‌హోమ్: వేర్వేరు దేశాల మధ్య ఆర్థిక అసమానతలకు కారణాలపై పరిశోధనలు చేసిన ముగ్గురికి ఈ ఏడాది ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం దక్కింది. డారన్ ఏస్‌మొగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ రాబిన్‌సన్‌కు అవార్డు ఇస్తున్నట్లు స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నోబెల్ కమిటీ సోమవారం ప్రకటించింది. వీరు చేసిన పరిశోధనలు దేశాలు సమృద్ధి చెందడం వెనుక సాంఘిక వ్యవస్థల పాత్రను అర్థం చేసుకునేందుకు, వేర్వేరు దేశాల మధ్య ఆర్థిక అసమానతలకు కారణాలు తెలుసుకునేందుకు

- మిగతా 2 లో

సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు

- అంతిమ యాత్రలో పాల్గొన్న వేలాది మంది
- గాంధీ ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

విశాలాంధ్ర-హైదరాబాద్: దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు ఆత్మీయులు కన్నీటి వీడ్కోలు పలికారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సాయిబాబాకు వేలాది మంది అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. వామపక్ష నాయకులు అరుణాంజలి ఘటించారు. వివిధ పార్టీలు, సంఘాల నేతలు ఆయన భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తొలుత నిమ్స్ నుంచి గాంధీ పార్క్ మీదగా మౌలాలీలోని నివాసానికి సాయిబాబా భౌతికకాయాన్ని తరలించారు. ప్రజల సందర్శనార్థం ఉంచారు. పౌరహక్కులు, రాజకీయ పార్టీలు, వామపక్ష నాయకులు, శ్రేయోభిలాషులు, అభిమానులు తరలి వచ్చి సాయిబాబాకు అంతిమ వీడ్కోలు పలికారు. అనంతరం అంతిమ యాత్ర నిర్వహించారు. అభిమానాలు, సామాజిక కార్యకర్తలు, నాయకులు నినాదాలు, డప్పులు, పాటల నడుమ గాంధీ ఆసుపత్రికి యాత్ర చేరుకుంది. లాల్ సలామ్, ఇంక్విలాబ్ జిందాబాద్, అమర్ రహే నినాదాలతో

- మిగతా 2 లో

నిధులకు గ్రహణం!

పెరిగిన బడుల నిర్వహణ వ్యయం

- చాక్‌పీస్‌లు, డస్టర్లకూ హెచ్‌ఎంల జేబులకే చిల్లు
- ఏడాదిన్నరగా కరెంట్ బిల్లుల షాక్
- ఫలించని విజ్ఞప్తులు... తలలుపట్టుకుంటున్న టీచర్లు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: కుండలో కూడు కుండలోనే ఉండాలి... బిడ్డలు మాత్రం దుడ్డులా ఉండాలి... అన్న చందంగా ఉంది ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు. పాఠశాలలు తెరిచి ఐదు నెలలు కావస్తున్నా... బడిలో ఖర్చులకు ప్రభుత్వ పరంగా నయాపైసా కూడా విడుదల కాలేదు. నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. చాక్ పీసులు, డస్టర్లు, చీపుర్లు, ఫినాయిల్, పరీక్షల పేపర్లు, తెల్ల కాగితాలు, రిజిస్టర్లు, కంప్యూటర్ల టోనర్లు తదితరలకు ప్రధానోపాధ్యాయులే తమ జేబుల్లోంచి ఖర్చు చేస్తున్నారు. బిల్లులను ప్రభుత్వానికి పంపినా... రెండేళ్లుగా నిధులు మంజూరు కాలేదు... ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ప్రయోజనం ఉండటం లేదని హెచ్‌ఎంలు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలల నిర్వహణకు ఒక్క పైసా కూడా విదల్చలేదని అంటున్నారు. గతంతో పోలిస్తే నిర్వహణ వ్యయం భారీగా పెరిగింది. ప్రాథమిక పాఠశాలకు రూ. 350 వచ్చే కరెంట్ బిల్లు రూ.వెయ్యికి, ఉన్నత పాఠశాలలో రూ.రెండువేలు వచ్చేది రూ.ఐదు వేలు దాటుతోంది. ఇవి కాక టాయిలెట్లలో రన్నింగ్ వాటర్, ఆర్‌ఓ ప్లాంట్లు, ఫ్యాన్లు,లైట్లు మరమ్మత్తులు, కంప్యూటర్ల విద్యుత్ వాడకం, నెట్ బిల్లులు, ఫర్నిచర్, కిటికీలు, తలుపుల రిపేర్లు వంటి తప్పనిసరి ఖర్చు... స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఖర్చులు పెరిగిపోయాయి. వీటన్నింటినీ తామే భరించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతి నెల తమ జీతం నుంచి కొంత భాగాన్ని కేటాయించాల్సి వస్తోందని అంటున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీంతో ఈ ఏడాదిన్నర నుంచి కరెంటు బిల్లుల చెల్లింపును నిలిపివేశారు. ఒకవేళ ఆ బిల్లులను పాఠశాలలే చెల్లించాలని ప్రభుత్వం చెబితే నిధులు ఎక్కడి నుంచి తేవాలో తెలియక హెచ్‌ఎంలు తలలు పట్టుకుంటున్నారు.

ఏలూరు జిల్లాలో 2,195 ప్రాథమిక, ప్రాథమికోన్నత ,ఉన్నత పాఠశాలలు, 205 మున్సిపల్ స్కూళ్లు, 22 రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలతో కలిపి 2,412 బడులకు 2023-24 సంవత్సరానికి సమగ్ర శిక్ష ప్రాజెక్టు మొత్తానికి కలిపి రూ.98 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను అధికారులు ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి సమర్పించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, పీటీఐ, సీఆర్పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, సెక్టోరల్ అధికారుల ఆగస్టు, సెప్టెంబరు నెల జీతభత్యాలు వారం క్రితం చెల్లించారు. ఇక ప్రాథమిక పాఠశాలల

- మిగతా 2 లో

'నీ అంతు చూస్తా'

- వీఆర్వోపై అంబాపురం సర్పంచ్ చిందులు
- ప్రభుత్వం మాదే... జిల్లాలో లేకుండా చేస్తానని బెదిరింపు
- విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినిపై బూతుపురాణం
- అధికారులు కాదు... నేను చెప్పింది చేయాలని హుకుం

గండికోట సీతయ్య

విశాలాంధ్ర-విజయవాడ: 'నీ అంతు చూస్తా... నీ వ్యవహారం ఏంటో తేలుస్తా... నీ తరపున ఎవడు వస్తాడో అదీ చూస్తా... నాకు కథలు చెప్పకు... నేను గ్రామ సర్పంచ్‌ను... డబ్బా రేకులవాడిని అనుకున్నావా... మీరంతా నా కింద పనిచేయాలి... నా మాట ఎవరైనా వినాలి... ఇక్కడ నేను చెప్పింది వేదం... నేను ఏం చెబితే అది చేయాలి... నాతో పెట్టుకోవద్దు... నాతో పెట్టుకుంటే జిల్లాలో లేకుండా బదిలీ చేయిస్తా... ప్రభుత్వం మాది... ఎమ్మెల్యే అనుచరుడిని... వైసీపీ ప్రభుత్వంలోనే సెక్రటరీని నిమిషాల్లో ఇక్కడి నుంచి పంపించిన వాడిని... మా ప్రభుత్వంలో నీవో లెక్కకాదు... అధికారులెవ్వరూ నా జోలికి రారు' అంటూ నోటితో చెప్పలేని బూతులు తిట్టి, దుర్భాషలాడిన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్యపై ఆ గ్రామ వీఆర్వో అరుణాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ట్రస్ట్ చైర్మన్ బండారు శ్రావణశ్రీ వరద బాధితుల సహాయార్థం 10 కేజీల బియ్యం బ్యాగ్‌లు వెయ్యికి పైగా పంపించి అంబాపురం పంచాయతీకి ఈ నెల ఎనిమిదో తేదీన లారీల్లో పంపించారు. పంచాయతీ ఆవరణలో దిగుమతి చేసేందుకు సర్పంచ్

- మిగతా 2 లో

17న బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకొని ఆ రాష్ట్రంలో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ సిద్ధమైంది. ఈనెల 17న కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పంచ్‌కులాలోని దసరా మైదానంలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారని పార్టీ రాష్ట్ర శాఖ ఒక ప్రకటన చేసింది. 17న ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకారానికి ప్రధాని ఆమోదం లభించిందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ వెల్లడించారు. ప్రస్తుత ముఖ్య మంత్రి నయాబ్ సింగ్ సైని తిరిగి ఆ పదవీ బాధ్యతలు చేపడతారు.

ఇదీ లోకం!

జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

- గెజిట్ విడుదల చేసిన కేంద్రం
- సీఎంగా రేపు ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేశారు. ఇందుకు సంబంధించి ఆదివారం అర్ధరాత్రి దాటాక కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయంతో సమైక్య రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన ఈ నోటిఫికేషన్‌లో జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019 (34/2019) సెక్షన్ 73 ద్వారా అందించబడిన అధికారాలను ఉపయోగించడం ద్వారా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 239, 239ఎ కింద జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి 31 అక్టోబర్ ,2019 నాటి ఉత్తర్వు (జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019లోని సెక్షన్ 54 (ప్రకారం) రద్దు చేయబడినట్లు పేర్కొన్నారు. ఇకపోతే ఇటీవల ముగిసిన జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్

- మిగతా 2 లో

చంద్రబాబు నాకు స్ఫూర్తి

ఆయన పాలనానుభవం రాష్ట్రానికి వరం
కంకిపాడు పల్లెపండుగ సభలో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెపండుగలో అధికార యంత్రాంగం బాధ్యతగా మెలగాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. సీఎం చంద్రబాబు పరిపాలన అనుభవం రాష్ట్రానికి వరమని ఆయన పునరుద్ఘాటించారు. వారం రోజుల పాటు పల్లెల్లో నిర్వహించబోయే 'పల్లె పండుగ' రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. కృష్ణాజిల్లా కంకిపాడులో పవన్ కల్యాణ్ పల్లె పండుగ పారంభించారు. కంకిపాడు,

- మిగతా 2 లో

ఇజ్రాయిల్‌పై హెజ్బుల్లా డ్రోన్ దాడి

నలుగురు సైనికుల హతం

బీరుట్: సెంట్రల్ ఇజ్రాయిల్‌లోని సైనిక స్థావరంపై హెజ్బుల్లా డ్రోన్ దాడి జరిపింది. నలుగురు ఇజ్రాయిలీ సైనికులు మరణించగా, అనేక మందికి గాయాలయ్యాయి. బిన్యామినా-గివత్ అదా సమీపంలోని ఐడీఎఫ్ స్థావరంపై డ్రోన్‌తో ఆదివారం సాయంత్రం హెజ్బుల్లా దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం సోమవారం వెల్లడించింది. 'హెజ్బుల్లా ఉగ్ర సంస్థ మా స్థావరంపై యూఏవీతో దాడి చేసింది. నలుగురు సైనికులు చనిపోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రుల్లో చేర్చి కుటుంబాలకు సమాచారం ఇచ్చాం. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది' అని ఐడీఎఫ్ తెలిపింది. డ్రోన్ దాడిలో 60 మందికిపైగా గాయపడినట్లు ఇజ్రాయిలీ అంబులెన్స్ సర్వీస్ (ఎండీఏ) తొలుత ప్రకటించింది.

లెబనాన్‌లో 200 హెజ్బుల్లా లక్ష్యాలు ధ్వంసం:ఐడీఎఫ్

దక్షిణ లెబనాన్‌పై వైమానిక దాడులను ఐడీఎఫ్ భీకరంగా కొనసాగించింది. హెజ్బుల్లాకు చెందిన 200 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఈ దాడుల్లో పదుల సంఖ్యలో హెజ్బుల్లా సభ్యులను తమ సైనికులు మట్టుబెట్టారని వెల్లడించింది. లెబనాన్ నుంచి ఇజ్రాయిల్ భూభాగంలోని ప్రొజెక్టైళ్లు దూసుకురావడంతో సెంట్రల్ ఇజ్రాయిల్‌లో సైరన్లు మోగినట్లు ప్రకటనలో ఐడీఎఫ్ పేర్కొంది.

ఇజ్రాయిల్‌కు అమెరికా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్

పశ్చిమాసియాలో భీకర దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా నిలుస్తూ అన్ని విధాలా సహాయ, సహకారాలను అమెరికా అందిస్తోంది. ఒకవైపు కాల్పుల విరమణ అంటూనే ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలను సమకూరుస్తోంది. పలస్తీనియన్ల విషయంలో మొసలి కన్నీరు కారుస్తున్న బైడెన్ ప్రభుత్వం కొత్త ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఇజ్రాయిల్‌కు పంపుతున్నట్లు తాజాగా ప్రకటించింది. క్షిపణి దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు ఇజ్రాయిల్‌కు ఈ వ్యవస్థ దోహదమవుతుందని తెలిపింది.

క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్, ఐపీఎస్‌లు

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. తనను ఆంధ్రాలోనే కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని క్యాట్‌కు సృజన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆమె ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్రానికి కేటాయించి తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ప్రశాంతి, ఆమ్రపాలి వారితోపాటు ఐపీఎస్ అధికారులు అభిలాశ్ బిస్త్, అభిషేక్ మహంతి, అంజనీకుమార్ ఏపీకి రావాల్సి ఉంది. ఇదే తరహాగా ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాల్సిన అధికారుల్లో సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్నారు. ఏపీ నుంచి తెలంగాణ కోసం దరఖాస్తు పెట్టుకున్న అనంతరాము, ఎస్.ఎస్.రావత్ విజ్ఞప్తులను డీఓపీటీ తిరస్కరించింది. దీంతో వారు రాష్ట్రంలోనే కొనసాగుతున్నారు. డీఓపీటీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నలుగురు ఐఏఎస్‌లు క్యాట్‌ను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ పిటిషన్లపై మంగళవారం కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ విచారించనుంది. క్యాట్ తీర్పు ఆధారంగా ఎవరు ఎక్కడ అనేదీ స్పష్టంకానుంది.

జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా జమ్మూ కశ్మీర్ తదుపరి ముఖ్యమంత్రి కానున్నారు. కూటమి నేతగా ఆయన ఎన్నికయ్యారు. ఈ నెల 16వ తేదీన ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు రంగం సిద్ధమైంది. గతంలో ఉన్న జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత 31 అక్టోబర్ 2019న జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన సంగతి విదితమే. ఆరేళ్ల తర్వాత అక్కడ రాష్ట్రపతి పాలన ఎత్తివేశారు.

సాయిబాబాకు కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

హోరెత్తింది. సాయిబాబా కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రి వైద్యులకు అప్పగించారు. అంతకుముందు ఆయన కళ్లను దానం చేసిన విషయం తెలిసిందే.

నేతల నివాళి: కూడా సాయిబాబా భౌతికకాయాన్ని సందర్శించి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎన్.మల్లేశ్, వీఎస్ బోస్, నాయకులు దశరథ్, ఈటీ నరసింహ, సహదేవ్, జంగయ్య, నిమ్మల నర్సింహ, రవి, రవీంద్రచారి, కృష్ణ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు ఉమా మహేశ్, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపల్లి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, సత్యప్రసాద్, ఎమ్మెల్సీ కోదండరామ్, మాజీ మంత్రులు కేటీ రామారావు, హరీశ్ రావు, ఎమ్మెల్యేలు మాధవరపు కృష్ణారావు, కాలేరు వెంకటేశ్, సుమన్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, ప్రముఖ పత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ నివాళు లర్పించారు.

గన్‌పార్క్ వద్ద సంతాప సభకు అనుమతి నిరాకరణ- వాగ్వాదం

సాయిబాబా భౌతికకాయాన్ని గన్‌పార్క్ వద్దకు తరలించి, అక్కడే సంతాప సమావేశాన్ని నిర్వహించాలని కుటుంబ సభ్యులు భావించగా అందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఐదు నిమిషాలు సంతాపం తెలుపుతామని కోరినా వారు నిరాకరించారు. సాయిబాబా భౌతికకాయాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి సభను నిర్వహిస్తామని చెప్పినా ఒప్పుకోలేదు. దీంతో పోలీసులకు, నాయకులు, అభిమానులకు మధ్య వాగ్వాదం జరిగింది. భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో ఉంచే కొందరు నివాళు లర్పించారు. 'సాయిబాబా ఆశయాలను కొనసాగిస్తాం, జోహార్ సాయిబాబా జోహార్' అంటూ అమరవీరుల స్థూపం వద్ద నినాదాలు చేశారు. ఆపై సాయిబాబా భౌతికకాయాన్ని మౌలాలిలోని ఆయన సోదరి నివాసానికి తరలించారు.

బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ

సాయిబాబా భౌతికకాయానికి నివాళులర్పించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ తాకింది. కేటీఆర్ గో బ్యాక్ నినాదాలు మార్మోగాయి.

పస్తులుంచి... చంపడమే వ్యూహం

- ఉత్తర గాజా స్వాధీనానికి ఇజ్రాయిల్ దూకుడు
- ఆహార సరఫరా నిలిపివేత
- వారంలోగా వెళ్లిపోవాలని పలస్తీనియన్లకు అల్టిమేటమిచ్చేలా ప్రణాళిక
- పార్లమెంటు పరిశీలనలో ప్రతిపాదన

టెల్‌అవీవ్: పలస్తీనా ప్రజలను పస్తులుంచి, చంపేయాలని, ఆ ప్రాంతం నుంచి తరిమివేయాలని ఇజ్రాయిల్ భావిస్తోంది. ఉత్తర గాజాను స్వాధీనం చేసుకొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఇప్పటికే ఇజ్రాయిల్ ప్రధాని, పార్లమెంటు పరిశీలనలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదన ఉన్నదని తెలిసింది. ఉత్తర గాజాలో అన్ని వైపుల నుంచి భీకర దాడులను ఇజ్రాయిల్ దళాలు సాగిస్తున్నాయి. తాగేందుకు నీరు, తినేందుకు ఆహారం లేకుండా చేసి, వారి ప్రాణాలను హరించి ఉత్తర గాజాను స్వాధీనం చేసుకోవాలని, పలస్తీనియన్లను లొంగదీసుకోవాలని బెంజమిన్ నెతన్యాహు వ్యూహాలు సిద్ధమవుతున్నాయి. గాజా స్ట్రిప్‌ను రెండుగా చీల్చి హమాస్ లేని కొత్త యంత్రాంగాన్ని నిరవధిక కాలం కోసం ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉత్తర గాజాపై ఇజ్రాయిల్ పట్టు కోసం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఉత్తర గాజాకు మానవతా సాయాన్ని పూర్తి స్థాయిలో ఇజ్రాయిల్ నిలిపివేసింది. యుద్ధ క్షేత్రంలో చిక్కుకుపోయిన వేలాది మందిని పస్తులు ఉంచుతోంది. హమాస్ సభ్యులు ఆకలితో అలమటించాలన్నదే తమ వ్యూహంగా చెప్పుకుంటోంది. కాగా, సెప్టెంబరు 30 నుంచి ఉత్తర గాజాకు ఆహారం, మంచినీళ్లు, మందుల సరఫరా ట్రక్కులు ఆగిపోయినట్లు ఐరాస తెలిపింది. గాజా నగరంతో పాటు గాజా స్ట్రిప్‌లోని ఉత్తర ప్రాంతాన్ని వదిలి వెళ్లేందుకు పలస్తీనియన్లకు వారం రోజుల గడువు ఇచ్చేలా రిటైర్డ్ జనరళ్ల బృందం ఒక ప్రతిపాదనను నెతన్యాహు, ఇజ్రాయిల్ పార్లమెంటు ముందర ఉంచింది. ఆపై ఉత్తర గాజాను మిలటరీ జోన్‌గా ప్రకటించాలని సూచించింది. గడువు ముగిసిన తర్వాత అక్కడే ఉన్న వారిని తిరుగుబాటుదారులుగా పరిగణించి... వారిని చంపేయొచ్చు లేదా ఆహారం, నీళ్లు, మందులు, ఇంధనం వంటివి నిరాకరించవచ్చు అని ఆ ప్రతిపాదన సూచించింది. హమాస్‌ను అణచివేసేందుకు, మిగిలిన బందీలను విడిపించేందుకు ఒత్తిడి తెచ్చేలా ఈ వ్యూహాన్ని అనుసరించనున్నట్లు చీఫ్ ఆర్కిటెక్ట్ తెలిపారు. అయితే ఈ ప్రతిపాదనపై ఇజ్రాయిల్ ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేదని సమాచారం.

ఆహార కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి

10 మంది మృతి-30 మందికి గాయాలు

జెరూసలేం: ఉత్తర గాజాలోని జబాలియా ఆహార సరఫరా కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి చేసింది. ఫిరంగులతో విరుచుకుపడింది. దీంతో పది మంది చనిపోయారు. మరో 30 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో పిల్లలు, మహిళలు ఉన్నారు. ఈ మేరకు పలస్తీనా వైద్య బృందం తెలిపింది. పది రోజులుగా జబలియాపై ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. బెయిల్ లహియా, బెయిల్ హనౌన్ పట్టణాల్లోకి ట్యాంకర్లు చొరబడ్డాయి. హమాస్ అంతమే లక్ష్యమంటూ దాడులను తీవ్రతరం చేశాయి. ఆహారం కోసం జనం గుమ్మిగూడిన సమయంలో డ్రోన్ ద్వారా కాల్పులకు ఇజ్రాయిల్ పాల్పడిందని, రక్తపాతం సృష్టించిందని వైద్య బృందం వెల్లడించారు.

తక్షణమే పీస్‌కీపర్లు వెనక్కి: ఐరాసకు నెతన్యాహు సూచన

ఐక్యరాజ్య సమితి పీస్‌కీపర్స్ (శాంతి దూతలు)ను యుద్ధ క్షేత్రాల నుంచి ఉపసంహరించుకోవాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్‌కు నెతన్యాహు ఒక ప్రకటనలో సూచించారు. 'హెజ్బుల్లాకు పట్టున్న ప్రాంతాలు, ఇతర యుద్ధ క్షేత్రాల నుంచి యూఎన్ఐఎఫ్ఐఎల్ ఉపసంహరణకు సమయం ఆసన్నమైంది. ఐడీఎఫ్ ఎన్నిసార్లు ఈ విషయాన్ని విన్నవించినా నిరాకరించారు. హెజ్బుల్లా ఉగ్రవాదులకు

మానవ కవచాలుగా ఐరాస శాంతి దూతలు మారేందుకు దోహదమవుతున్నారు. తక్షణమే వారందరినీ వెనక్కి పిలిపించండి' అంటూ గుటెర్రస్‌ను ఉద్దేశించి నెతన్యాహు ఒక ప్రకటన చేశారు.

గాజా స్కూల్‌పై దాడిలో 20 మంది హతం

డెయిల్ అల్ బలాహ్‌లోని అల్ అక్సా మార్టైర్స్ ఆసుపత్రి వద్ద సోమవారం ఉదయం జరిపిన బాంబు దాడుల్లో ముగ్గురు చనిపోగా, 50 మందికి గాయాలయ్యాయి. గుడారాల దగ్ధమయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. వారిలో అనేక మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. గాజాలోని స్కూలుపై ఆదివారం రాత్రి ఇజ్రాయిల్ వైమానిక దాడి జరిపింది. ఈ ఘటనలో పిల్లలతో సహా 20 మంది చనిపోయారు. పెద్ద సంఖ్యలో పలస్తీనియన్లు ఆశ్రయం పొందే నుసీరత్ శరణార్థి శిబిరం పరిధిలోని స్కూలుపై ఈ దాడి జరిగిందని అధికారులు తెలిపారు.

ముంచెత్తిన వర్షం

(మొదటిపేజీ తరువాయి)

చిత్తూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, నీటిపారుదల అధికారులు పెన్నా నది గట్లు పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు, మద్దిపాడు, గిద్దలూరు, కొమరవోలులోనూ వర్షం ముంచెత్తుతోంది. ఒంగోలులో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, మార్టూరు, ఇంకొల్లు, కొల్లూరు, వేమూరు, అద్దంకి, యద్దనపూడి, జె.పంగులూరు, బల్లికురవ, నిజాంపట్నం, కర్లపాలెంలో వర్షం కురుస్తోంది. కృష్ణా జిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, అవనిగడ్డలో ఈదురుగాలులతో వర్షం పడుతోంది. విశాఖపట్నంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. అన్నమయ్య జిల్లాలోనూ వర్షం కురుస్తోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ సెలవు ప్రకటించారు.

సీఎం అత్యవసర సమీక్ష...ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశం

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, మంత్రులు, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడి నాలుగు రోజులు వర్షాలుంటాయని వాతావరణ శాఖ వెల్లడించినందున... చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాలపై అధికారులు, ప్రభుత్వ విభాగాల సన్నద్ధతపై సమీక్షించారు. వర్షాలపై మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపి ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ముఖ్యంగా చెరువు కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టిపెట్టాలని చెప్పారు. వాగులు, కాలువల వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఆదేశించారు. అప్రమత్తతతో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చేయాలని చెప్పారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి ప్రజల వినతులపై వేగంగా స్పందించాలన్నారు. ప్రకాశం, నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని అధికారులు సీఎంకు వివరించారు. లోతట్టు, ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని, తీరం దాటేవరకు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

మరో మూడు రోజులు వర్షాలు

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్యదిశగా కదులుతూ మంగళవారం నాటికి దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య భాగాల్లో బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఆ తర్వాత 48 గంటల్లో బలపడి పశ్చిమ వాయవ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలవైపు కదిలే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఈనెల 17వ తేదీ వరకు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.

తిరుమలలో బ్రేక్ దర్శనాలు రద్దు

భారీ వర్షాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఈవో శ్యామలరావు వర్చువల్ విధానంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాగల 36 గంటల్లో భారీ వర్ష సూచనపై సమావేశంలో చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముందుజాగ్రత్తగా శ్రీవారి ఆలయంలో 16వ తేదీన వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 15న సిఫార్సు లేఖలు అనుమతించకూడదని, అలాగే భక్తుల భద్రత దృష్ట్యా బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఈవో సూచించారు.

ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎస్వీబీసీ, మీడియా, టీటీడీ సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని అధికారులను ఈవో ఆదేశించారు.

అమరావతిలో 'టాటా' ఇన్నోవేషన్ హబ్

(మొదటిపేజీ తరువాయి)

జరిపారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఉద్యోగ కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దానికనుగుణంగా పారిశ్రామిక విధానాలు ఉండాలని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలను, పెట్టుబడుదారులను ఆకర్షించి... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మార్గం సుగమం చేసేలా నూతన పాలసీలు ఉండాలన్నారు. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్క్ పాలసీపై మరికొంత కసరత్తు జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. మిగిలిన మూడు పాలసీలను వచ్చే కేబినెట్ ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. నూతన పాలసీతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చేందుకు ఆస్కారం ఏర్పడుతుందని సీఎం అన్నారు. దాదాపు 7-8 శాఖల్లో నూతన పాలసీలకు శ్రీకారం చుడుతున్న ప్రభుత్వం... వీటి రూపకల్పనపై మూడు నెలలుగా కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి సూచనలు, పరిశ్రమ వర్గాల అభిప్రాయాలు, ఉత్తమ ఫలితాలు ఇచ్చిన ఇతర రాష్ట్రాల విధానాల ఆధారంగా అధికారులు పాలసీలు రూపొందించి ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వీటిపై సీఎం లోతుగా చర్చించి సమీక్ష నిర్వహించారు. ప్రతి పాలసీ తయారీలో తన అనుభవాలు, ఆలోచనలు పంచుకున్నారు. ఆయా పాలసీలపై ముఖ్యమంత్రికి అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ అమల్లోకి వచ్చిన వెంటనే పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన వారికి అదనంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్, డేట్ ఆఫ్ కమర్షియల్ ప్రొడక్షన్ ఇచ్చిన మొదటి 200 కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేలా ముసాయిదా విధానంలో ప్రతిపాదనలు చేశారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు అదనంగా 10 శాతం ప్రోత్సాహకం ఇచ్చేలా పారిశ్రామిక విధానం రూపొందించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వడంపై ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది పారిశ్రామిక ప్రగతికి, ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. త్వరితగతిన ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ఇలాంటి కీలక నిర్ణయాలు దోహదం చేస్తాయని, ఈ విషయంలో సాధ్యాసాధ్యాలను, విధివిధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే భావనతో ఎంఎస్ఎంఈ పాలసీ ఉండాలని, అది కూటమి ప్రభుత్వ విధానమని సీఎం సూచించారు. ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా వ్యాపారవేత్తలకు అదనంగా ఐదు శాతం ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రతిపాదించాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాకు స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

పునాదిపాడుల్లో తలపెట్టిన పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామసభల్లో 30 వేల పనులకు తీర్మానించారని, ప్రజలంతా కలిసి తమ గ్రామాల్లో కావల్సిన అభివృద్ధి పనులను వారే తీర్మానించుకున్నారని పవన్ చెప్పారు. ఇందులో ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేదని, పూర్తిగా ప్రజలు తీసుకున్న అభివృద్ధి పనులకు వారం రోజులపాటు శంకుస్థాపనలు జరగనున్నాయని ఆయన చెప్పారు. సంక్రాంతి నాటికి ఈ పనులు పూర్తి కావాలన్నదే లక్ష్యమని స్పష్టంచేశారు. కీలకమైన పనులన్నీ ఇప్పటికే గుర్తించామని, దానికి కలెక్టర్లు పరిపాలన ఆమోదాలు ఇచ్చారని, దీంతో పనులన్నీ ప్రారంభం కానున్నాయని అన్నారు. ప్రతి పనికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకునేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేస్తామని, శంకు స్థాపన చేసిన దగ్గరే ఆయా పనుల పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుతామన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు కనీసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎవరో తెలియని దౌర్భాగ్యం ఉండేదన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో గ్రామ సభలు నిర్వహించిన దాఖలాలు లేవని, అసలు పంచాయతీరాజ్ నిధులు ఏమయ్యాయో తెలియదని విమర్శించారు. ఈ శాఖ బాధ్యతలు తీసుకున్న తర్వాత అనేకసార్లు నిధుల మీద సమీక్షించినా గత ప్రభుత్వంలో నిధులు ఎలా, ఎటు వెళ్లాయనేది ఓ బ్రహ్మ పదార్థంలా కనిపించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దిశానిర్దేశం, కేంద్ర సహకారంతో ముందడుగు వేస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధ్వర్యంలో జరిగే పనులను ఇతర శాఖలు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఉపాధి హామీ పథకం చాలా గొప్ప కార్యక్రమమని, దానిని సరిగ్గా వినియోగించు కుంటే గ్రామాల్లో చాలా పనులు చేసుకోవచ్చని, కేంద్రం దీనికి వెచ్చిస్తున్న నిధులను, పనిదినాలను గ్రామీణుల జీవనస్థితిగతులు మార్చడానికి ఉపయోగించుకోవచ్చని సూచించారు. చిత్తశుద్ధి, పారదర్శకత, అభివృద్ధి కాంక్షతో పనులన్నీ చేస్తున్నామన్నారు. ఎక్సైజ్, గనుల.శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో బిల్లులు చెల్లించపోవడంతో సర్పంచులు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందితేనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని, మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకొని పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని చెప్పారు. సభలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

నిధులకు గ్రహణం!

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ గ్రాంట్ రూ.మూడుకోట్ల 12 లక్షల 85వేలు, హైస్కూల్ గ్రాంటు రూ.1కోటి 47 లక్షలు, లైబ్రరీ రూ.38 లక్షలు, క్రీడల నిర్వహణకు రూ.61 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో క్రీడలకు రూ.25 లక్షలు, ఎంఈఓ గ్రాంట్ రూ.38 లక్షలు, స్కూల్ కాంప్లెక్స్ గ్రాంట్ రూ.48 లక్షలు, సీడబ్ల్యూఎస్ఎన్ (ప్రత్యేక అవసరాలు గల పిల్లలు) లో 528 మందికి ఎస్కార్ట్ ఖర్చు ఒక్కొక్కరికి రూ. మూడువేలు, 624 మందికి రవాణా భత్యం కింద ఒక్కొక్కరికి రూ.మూడువేలు, రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్షణ (బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణ నిమిత్తం రూ.56 లక్షలు, ఫర్నిచర్ గ్రాంట్ రూ.1కోటి 23 లక్షలు, స్కూల్ కాంప్లెక్స్‌లో టీఎల్ఎం తయారీకి రూ.40 లక్షలు, కంటింజెంట్ బిల్ రూ.50 లక్షలు, ఎంఆర్సీలలో టీఎల్ఎం గ్రాంట్ రూ.8 లక్షల 40 వేలు, కంటింజెంట్ బిల్లులు రూ.11 లక్షల 20వేలు తదితర ఖర్చుల నిమిత్తం మొత్తం రూ.98 కోట్ల ప్రతిపాదనలను పంపించారు. సమగ్ర శిక్ష సిబ్బంది జీతాలు మినహా బడ్జెట్లో పాఠశాలల నిర్వహణకు ఒక్క రూపాయి విడుదల కాలేదని తెలుస్తోంది.

ఏటా నగదు చెల్లింపు ఇలా...

వాస్తవానికి విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాల నిర్వహణ గ్రాంటు విడుదల చేస్తారు. ఒక పాఠశాలలో విద్యార్థులు 1-30 ఉంటే రూ.10వేలు, 31-100కు రూ.25 వేలు, 101-250కు రూ.50 వేలు, 251-1000... రూ.75 వేలు, 1001 మంది విద్యార్థులు పైన ఉంటే రూ.లక్ష ఏటా కేటాయిస్తారు. 2021-22లో 20 శాతం నిధులను విడుదల చేశారని అంటున్నారు. నాటి నుంచి నేటి వరకు నయా పైసా నిధులు విడుదల కాలేదని తెలుస్తోంది. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండాల్సిందేనని నిత్యం జరిగే వెబ్‌ఎక్స్ మీటింగ్, వీడియో కాన్ఫరెన్స్‌లు, సందర్శనల సమయంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులు హుకుం జారీ చేయడం జరుగుతోందని ఉపాధ్యాయ సంఘ నాయకులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్వహణ గ్రాంట్ బకాయిలతో సహా విడుదల చేయాలని సంఘ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

'నీ అంతు చూస్తా'

(మొదటిపేజీ తరువాయి)

సహకరించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదే గ్రామంలో బోసుబొమ్మ రోడ్డులో గోడౌన్ తీసుకుని వీఆర్ఏల సహకారంతో అక్కడ భద్రపరిచారు. అదే రోజు సాయంత్రం అధికారుల ఆదేశానుసారం 650 మందికి పైగా బాధితులకు పంపిణీ చేశారు. ఇంతలో సీతయ్య... నీవు అక్కడ ఎవరికీ పంపిణీ చేయవద్దు... నేను చెప్పిన చోట, నాకు ఇష్టం వచ్చిన వారికి పంపిణీ చేయమని వీఆర్వోను దుర్భాషలాడుతూ ఫోన్ ద్వారా బెదిరించాడు. నోటితో చెప్పలేని బూతులు తిడుతూ విధులకు ఆటకం కలిగిస్తూ... మహిళా ఉద్యోగిని అన్న కనికరం లేకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. మరుసటి రోజు కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా... ఒక్కసారిగా దూసుకొచ్చి సహ ఉద్యోగులు షిలాక్, గజిగంటి స్వరూపరాణి సమక్షంలోనే బూతుపురాణం అందుకున్నాడు. అందరిముందూ మహిళా అధికారిణిని అవమానపరిచాడు. బాధితుల సహాయ వివరాలను తహసీల్దార్ కార్యాలయానికి పంపిస్తుండగా... సీతయ్య సహాయకుడు దొండపాటి హరీశ్... దొంగచాటుగా ఫొటోలు తీసి విధులకు ఆటంకం కలిగించాడు. గత నెలలో కూడా ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరకులు చివరికి భోజనాలు కూడా నేను చెప్పిన వాళ్లకే ఇవ్వాలని సర్పంచ్ హుకుం జారీ చేసి విధులకు ఆటకం కలిగించినట్టు వీఆర్వో కన్నీటిపర్యంతమయ్యారు. హద్దుమీరి కార్యాలయ రూమ్‌లోకి ప్రవేశించి అసభ్యకరంగా బూతులు మాట్లాడుతూ విధులకు భంగం కలిగించిన సర్పంచ్ సీతయ్యపై చర్యలు తీసుకోవాలంటూ ఈ నెల పదో తేదీన టూ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ)కు వీఆర్వో అరుణాదేవి ఫిర్యాదు చేశారు. తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి కేసు నీరుగార్చేలా సర్పంచ్ వ్యవహరిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ఎస్సీలంటే చిన్నచూపు: బాధితులు

ఇదిలా ఉండగా... సర్పంచ్ సీతయ్య ఎస్సీలను అవమానపరుస్తున్నాడంటూ కొందరు గ్రామస్థుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్సీలమనే తమను ఉద్యోగం నుంచి తొలగించాడని కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసిన కుమార్ అనే వ్యక్తి ... సర్పంచ్‌గా సీతయ్య అధికారంలోకి రాగానే తనను తొలగించి, అతడి అనుచరుడిని నియమించాడని ఆరోపించాడు. వరద సమయంలో వృద్ధులైన తల్లిదండ్రులను రక్షించుకోవడానికి వారం రోజులు సెలవు పెట్టినందుకు తనను అకారణంగా సీతయ్య తొలగించినట్టు ఓ చెత్తతరలించే వాహన డ్రైవర్ దాస్ లబోదిబోమంటున్నాడు. ఆరేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నానని చెప్పాడు. పంచాయతీ సెక్రటరీ కూడా సర్పంచ్‌కే వంతపాడి తన ఉద్యోగం ఊడగొట్టారని కన్నీరుపెట్టుకున్నాడు. న్యాయం కోసం విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి సోమవారం సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టానన్నారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగుల విధుల్లో తలదూర్చి తాను చెప్పినట్టు చేయలేదని తన రాజకీయ దుర్నీతిని ఉపయోగించి ప్రభుత్వ నిబంధనలు తూచా తప్పని సెక్రటరీని వైసీపీ హయాంలో సాగనంపినట్టు విశ్వసనీయ సమాచారం.

కేసు ఉపసంహరించుకోండి: ఆర్ఐ ఒత్తిడి?

తన విధులకు సర్పంచ్ సీతయ్య ఆటంకం కలిగించిన విషయం తెలిసినా... ఓ ప్రభుత్వ ఉద్యోగిగా, తన పైఅధికారిగా సహకరించాల్సిన ఆర్ఐ... తనను కేసు ఉపసంహరించాలని ఒత్తిడి తెస్తున్నట్టు వీఆర్వో చెప్పారు. సర్పంచ్ ఒత్తిడి మేరకే తనను కేసు విత్‌డ్రా చేసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. మరోవైపు వీఆర్వోను దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించిన సర్పంచ్‌పై మీరు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారంటూ విశాలాంధ్ర ప్రతినిధి ఎమ్మార్వోను సంప్రదించగా... అసలు ఆ విషయం తన దృష్టికి రాలేదన్నారు. జరిగిన విషయాన్ని ఆర్ఐ కొంత మేరకే చెప్పారన్నారు.

ఆర్థిక అసమానతలపై పరిశోధనకు 'నోబెల్'

(మొదటిపేజీ తరువాయి)

ఉపకరించాయని పేర్కొంది. "దేశాల మధ్య ఆదాయ వ్యత్యాసాలను తగ్గించడం మన ముందు ఉన్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో సాంఘిక వ్యవస్థలు ఎంత ముఖ్యమో ఈ పరిశోధకులు మనకు తెలియచెప్పారు. చట్టాలను సరిగా పాటించని సమాజాలు, ప్రజలను దోచుకునే వ్యవస్థలు ఉన్న దేశాలు అభివృద్ధి కావు, సరైన దిశలో మార్పు చెందవు. అలా ఎందుకు జరుగుతుందో తెలుసుకునేందుకు వీరి పరిశోధన మనకు ఉపకరిస్తుంది" అని నోబెల్ కమిటీ తెలిపింది. ఇక నోబెల్ పురస్కార విజేతలైన ఏస్‌మొగ్లు, జాన్సన్- మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పని చేస్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో రాబిన్‌సన్ పరిశోధనలు చేస్తున్నారు. అర్థ శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని సాంకేతికంగా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించరు. డైనమైట్‌ను కనిపెట్టిన 19వ శతాబ్దపు స్వీడిష్ వ్యాపారి, రసాయన శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ ఐదు రంగాల్లో (వైద్యం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం, శాంతి) నోబెల్‌పురస్కారాన్ని ఇవ్వడం మాత్రమే ప్రారంభించారు. అయితే, ఆయన గుర్తుగా బ్యాంగ్ ఆఫ్ స్వీడన్ 1968 నుంచి ఆర్థిక శాస్త్రంలో పురస్కారాన్ని ఇవ్వడం ప్రారంభించింది. అధికారికంగా దీనిని బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ప్రైజ్ అంటారు. కానీ, మిగిలిన ఐదు పురస్కారాలతోపాటే ఆర్థిక శాస్త్రం అవార్డును కూడా నోబెల్ వర్ధంతి అయిన డిసెంబర్ 10న విజేతలకు ప్రదానం చేస్తారు.

వరదబాధిత రైతులకు రుణమాఫీ

ఏపీ రైతుసంఘాల సమన్వయసమితి డిమాండ్

నిరసనలపై 29న సన్నాహక సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఈ ఏడాది పంటలకు రుణాలు తీసుకున్న వరద బాధితులకు రుణాలు రద్దు చేయాలని మాజీ మంత్రి, ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో రైతు సంఘాల సమన్వయ సమితి నాయకుల సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కంద, పసుపు రైతులకు ప్రభుత్వ సహాయం ఎకరానికి రూ. 14 వేలు చొప్పునే అందిందని, వాస్తవానికి ఖర్చు అధికమైందన్నారు. అందువలన కంద పంట రైతులకు ఎకరానికి అదనంగా రూ. 86 వేలు, పసుపు పంటకు రూ. 46వేలు చొప్పున అదనంగా చెల్లించాలని కోరారు. వాస్తవ పంట సాగుదారులను గుర్తించి వారికి మాత్రమే కౌలు రైతులకు చెల్లించాలన్నారు. భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. లంక భూములు, ఇతర భూముల్లో పేరుకుపోయిన ఇసుక, బురద, మట్టిని ప్రభుత్వ వ్యయంతో తొలగించాలని... మరల పంట వేసుకోవటానికి విత్తనాలు, ఎరువులు, రుణసదుపాయం కల్పించాలన్నారు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయి బ్యాంకు రుణాలు కూడా తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలన్నారు.ఇటీవల జరిగిన దక్షిణ భారత రైతు సంఘాల సమావేశంలో నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై చేపట్టే నిరసనలకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నామన్నారు. వరదల్లో పంట నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూమి కోల్పోయిన రైతులందరికి నష్టపరిహారం, ఉపాధి కల్పించాలన్నారు. అనంతపురం జిల్లాలో లేపాక్షి నాలెడ్జి పార్క్ కొరకు, కడపలో బ్రహ్మణి స్టీల్, ఎయిర్ పోర్టు కొరకు రైతుల నుంచి బలవంతంగా ప్రభుత్వం తీసుకున్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి భూములు అవసరం లేని పక్షంలో రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. రైతు సంఘం నాయకులు వై. కేశవరావు మాట్లాడుతూ నవంబర్ 26వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపును విజయవంతం చేసేందుకు, ఈ నెల 29న ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితిలోని నాయకత్వానికి వ్యవసాయ రంగం, రైతాంగం ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తదనంతరం జిల్లా స్థాయిల్లో కూడా నిర్వహిస్తామన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య మాట్లాడుతూ ఈ ఏడాది వరద బాధితుల్లో వాస్తవ పంట సాగుదారులైన కౌలు రైతులకు నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సర్వేలో కౌలు రైతులను నమోదు చేయకుండా, సాగుచేయని, పెట్టుబడి పెట్టని భూయజమానులకు నష్టపరిహారం అందించా రన్నారు. ఇప్పటికైనా రీ సర్వే చేసి, గుర్తించి, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర సంఘాల నాయకులు డి. హరినాథ్, యం. వెంకటరెడ్డి, యం. హరిబాబు, యు. వీరబాబు, చల్లపల్లి విజయ, మరీదు ప్రసాద్ బాబు(కిసాన్ సంఘటన్), కోగంటి ప్రసాద్, కోటయ్య, కాసాని గణేష్ బాబు, జీవీ రంగారెడ్డి, మాదు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ కమిషనర్‌ను కలిసిన ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావును సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సోమవారం కలిశారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఐహెచ్‌సీ భవన్‌లోని ఆ శాఖ కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఆయనను సత్కరించారు.

పాఠశాల విద్యపై శ్వేతపత్రం

పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యపై చంద్రబాబు ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పదేళ్లుగా పాఠశాల విద్యపై ప్రభుత్వాలు పెట్టే వ్యయం పెరుగుతోందని, అదే స్థాయిలో విద్యా పరిస్థితులు లేవన్నారు. ఈ ఏడాది పాఠశాల విద్యకు గత ప్రభుత్వం ఏఏ పథకాలకు ఎంతెంత కేటాయింపులు చేసింది... ఆన్ గ్రౌండ్ నిధులెంత... ఖర్చు పెట్టిందెంతో వివరాలు వెల్లడించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలపాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య అందించేందుకు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పటిష్టంగా అమలు చేయాలన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోని మనబడి నాడు-నేడు కార్యక్రమాల పెండింగ్ పనులు కొనసాగించాలని కోరారు.

లిక్కర్ మాఫియా అడ్డాగా ఏపీ

సూత్రధారి చంద్రబాబే

వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లిక్కర్ మాఫియాకు, సిండికేట్లకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. 'అత్యంత పారదర్శకంగా నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి, వాటిని ప్రైవేట్‌కు, మీవారికి అప్పగించాలన్న మీ నిర్ణయం అవినీతికోసం వేసిన స్కెచ్ కాదా?, మీ మనుషులతో సిండికేట్ ఏర్పాటుచేసి షాపులను కొట్టేయడం నిజం కాదంటారా?' అంటూ ఎక్స్ వేదికగా సోమవారం ఆయన ట్వీట్ చేశారు. రానున్న ఐదేళ్లలో పెద్దమొత్తంలో ఎమ్మార్పీ కంటే అధిక రేట్లతో అమ్మి, మీరు అనుమతిచ్చిన డిస్టిలరీలద్వారా అమ్మకాలు భారీ స్థాయిలో పెంచేసి వేలకోట్ల రూపాయల అక్రమ రాబడికి ద్వారాలు తెరిచిన మాట వాస్తవమే కదా? చంద్రబాబు ప్రభుత్వం తెచ్చిన లిక్కర్ పాలసీ గొప్పదే అయితే...రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు బెదిరింపులకు దిగారు?, నిష్పక్షపాతంగా వ్యవహరించిఉంటే అరాచకాలకు పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నించారు. మీవారికి షాపులు ఇవ్వని పక్షంలో బదులుగా వాటాలు సమర్పించడంకోసం లిక్కర్ కొనుక్కున్నవారి జేబులు గుల్లచేయడానికి మీరంతా సిద్ధం అయినట్టేకదా? అని పేర్కొన్నారు. కొత్తపాలసీ వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రానీయకుండా, చంద్రబాబు ప్రభుత్వం గండికొట్టిందని... ప్రజలను మభ్యపెట్టడానికి చీప్ లిక్కర్ రేట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. దీనికోసం క్వాలిటీని తగ్గిస్తూ... అమ్మకాలు విపరీతంగా పెంచేసి, తద్వారా డిస్టిలరీల నుంచి లంచాల ఆదాయం పెంచుకునే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ దుకాణాల ద్వారా మద్యం అమ్మితే...అమ్మకాలపై , అమ్మకం వేళలపై నియంత్రణ ఉంటుందని, మద్య నియంత్రణ అనే ప్రాథమిక బాధ్యత దిశగా ప్రభుత్వాలు కొంతైనా పనిచేసినట్టు అవుతుందని సూచించారు. లక్షల సంఖ్యలో ఉద్యోగాలంటూ అబద్ధాలు చెప్పి...మీ స్వార్థం కారణంగా ప్రభుత్వ లిక్కర్ షాపుల్లో పనిచేస్తున్న 15వేలమందిని ఒక్కసారిగా రోడ్డునపడేశారని ఆరోపించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను ఇప్పటికే తిరోగమనం పట్టించారని, అవినీతి ధ్యేయంగా తెచ్చిన లిక్కర్ పాలసీతో రాష్ట్రాన్ని మరింత వెనక్కి లాగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ అసమర్థ చర్యలను వెంటనే సరిదిద్దుకోవాలని, లేకుంటే ప్రజల తరఫున ఉద్యమిస్తామని జగన్ హెచ్చరించారు.

'స్టార్టప్ ఆంధ్ర' మా ఆయుధం

పరిశ్రమల స్థాపనకు మెరుగైన ప్రోత్సాహకాలు

యూఎస్-ఇండియా ఫోరం లీడర్‌షిప్ సదస్సులో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అధునాతన సాంకేతిక ప్రక్రియలో స్టార్టప్ ఆంధ్ర అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, పరిపాలన విధానాన్ని సమూలంగా మార్చే ఓ అద్భుత ఆయుధంగా ఉపయోగపడుతోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అంకురాల ద్వారా సాంకేతికతను ఏకీకృతం చేసి వినూత్న మార్గాలు అన్వేషిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఏపీలో సంభవించిన వరద విపత్తును సమర్థంగా ఎదుర్కోవడంలో అంకుర సంస్థల వినియోగం ఓ నూతన అధ్యాయంగా అభివర్ణించారు. సహాయక చర్యల కోసం తొలిసారిగా విజయవాడలో 40 కిలోల వరకు మోసుకెళ్లగల డ్రోన్‌లను వినియోగించామని, ముంపు ప్రాంతాల్లో ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. న్యూఢిల్లీలోని తాజ్ మహల్ హోటల్ లో సోమవారం జరిగిన యుఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం లీడర్ షిప్ సమ్మిట్ లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఫోరమ్ చైర్మన్ జాన్ ఛాంబర్స్ అధ్యక్షత వహించారు. ఫైర్‌సైడ్ సంభాషణలో భాగంగా ఆపిల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విరాట్ భాటియా అడిగిన అనేక ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సూటిగా సమాధానాలిచ్చారు. సదస్సులో వేగవంతమైన ఆర్థిక,సామాజిక అభివృద్ధిగా ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై లోకేశ్ మాట్లాడుతూ....పరిశ్రమల స్థాపనకు భారత్‌లో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ లో అనువైన వాతావరణాన్ని కల్పించి, ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు చెప్పారు. వేగంగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేందుకు ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డును పునరుద్ధరించామని, ప్రైవేటు సెక్టారు ప్రముఖులతో సలహా మండలి ఏర్పాటుతో సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలుచేస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సస్ (నైపుణ్య గణన) కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని...ఇందులో భాగంగా తొలివిడతలో మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా హౌస్ హోల్డ్ డాటా, ఎడ్యుకేషన్ డేటా సూక్ష్మస్థాయిలో సేకరిస్తున్నామన్నారు. వచ్చే 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యానికి స్కిల్ సెన్సస్ దోహదపడుతుందన్నారు.

వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగుతున్నాం. విశాఖ నగరాన్ని ఐటీ, కెమికల్, ఫార్మా, మెడికల్ డివైస్ కేంద్రంగా తీర్చిదిద్దుతాం. అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివృద్ధికి ఫోకస్ పాయింట్లను నిర్దేశించాం. రెన్యువబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ డివైజ్, పెట్రో కెమికల్, ఫార్మా రంగాలకు పెద్దపీట వేస్తాం. 2029నాటికి 72 గిగావాట్స్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని లోకేశ్ వివరించారు. ట్రిలియన్ డాలర్ల స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి సాధించిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించాలని లక్ష్యం పెట్టుకున్నామని, అమరావతిని వరల్డ్ క్లాస్ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఫేజ్ -1 లో 100 రకాల ప్రభుత్వ సేవలను ఫోన్ ద్వారా అందించబోతున్నాం. పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగం ద్వారా మెరుగైన సేవలందిస్తామని, అమరావతిని గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా, వరల్డ్ క్లాస్ సిటీగా తయారుచేసేందుకే ప్రణాళికలు సిద్ధంచేశామని లోకేశ్ వివరించారు.

మద్యం సిండికేట్లలోనూ రాజకీయమా 'బాబు': షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం సిండికేట్లను అరికట్టడంలో రాజకీయ చోద్యం చూస్తున్నారా, ప్రభుత్వ పనుల్లో రాజకీయ జోక్యం వద్దని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పుడేం సమాధానం చెబుతారంటూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ప్రశ్నించారు. ఎక్కడికక్కడే అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై, సిండికేట్లుగా ఏర్పడి మద్యం షాపులను దక్కించుకున్నారని సోమవారం ఆమె ఎక్స్‌వేదికగా ఆరోపణలు గుప్పించారు. కూటమి సిండికేట్లకే మూడువేలకు పైగా మెజార్టీ దుకాణాలు దక్కాయంటే... మీ పారదర్శకత ఎంత గొప్పగా ఉందో అర్థం అవుతోందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల కనుసన్నల్లోనే టెండర్ల ప్రక్రియ సాగిందని, సాధారణ ప్రజలకు షాపులు దక్కకుండా బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ప్రాణాలు పోతాయని హెచ్చరించినప్పటికీ, కూటమి నేతలకు కాదని పొరపాటున ఎవరికైనా లాటరి చిక్కితే, వారికి లైసెన్స్ ఇస్తారా... 30 శాతం కమీషన్ ఇస్తారా... మమ్మల్ని కాదని మద్యం ఎలా అమ్ముతారో చూస్తామంటూ బహిరంగంగానే బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గత వైసీపీ 'ఓన్లీ క్యాష్' అని గుడిని మింగేస్తే... ఇప్పుడు మీరు లింగాన్ని మింగేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రైవేటు పేరుతో తక్కువ ధర అని చెప్పి, మద్యం ఏరులై పారించి, వేల కోట్లు దోపిడీకి కూటమి సర్కార్ తెరలేపిందని, పాత సర్కారు మద్యం కుంభకోణాల పాపాలపుట్టలు బద్దలుకాకుండా జాగ్రత్త పడుతున్నారని తెలిపారు.

నేటి నుంచి అందుబాటులో ఎస్జీటీ టెట్ ప్రాథమిక కీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)-2024 ఎస్జీటీ అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు, ప్రాథమిక కీ వివరాలను వరుసవారీ సోమవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎస్జీటీ పరీక్షల ప్రాథమిక కీలపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను ఈనెల 18 వరకు aptet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తారు. ఇప్పటికే భాషా విభాగం పరీక్షల కీలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

పదో రోజు 84.59 శాతం హాజరు : టెట్ పదో రోజు సోమవారం ఉదయం సెషన్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం పేపర్-2(ఏ) మ్యాథ్స్, సైన్స్ అభ్యర్థులకు అర్హత పరీక్షలు జరిగాయి. 21,203 మందికిగాను 17,937 మంది అభ్యర్థులు (84.59) శాతం మంది హాజరయ్యారు. ఉదయం 24 సెంటర్లలో జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల అర్హత పరీక్ష 5,460 మందికిగాను 4,830 మంది (88.46శాతం) రాశారు. మధ్యాహ్నం 61 సెంటర్లలో పేపర్-2(ఏ)మాథ్స్, సైన్స్ అభ్యర్థులు 15,743 మందికి గాను13,107 మంది (83.29 శాతం) మంది హాజరయ్యారు.

సీఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం సహాయ నిధికి అనేక మంది దాతలు విరాళాలు అందించారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వివరాలను ఇచ్చారు. యర్రగొండపాలెం టీడీపీ ఇంఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అధ్వర్యంలో రూ.30 లక్షల85 వేలు, తుళ్లూరు గ్రామ రైతులు రూ.ఎనిమిది లక్షలు, విజయ్‌కుమార్ రూ.ఆరు లక్షలు, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏపీ సర్కిల్) రూ.3,11,116, ఎన్టీఆర్ టీడీపీ వింగ్(న్యూజిల్యాండ్) రూ.రెండు లక్షల 70 వేలు, మల్లంపాటి శ్రీనివాసరావు రూ.రెండు లక్షల 50 వేలు, లక్ష్మీ సుభాషిని రూ.లక్ష, వెలంగ సరంధ, మంచికలపూడి సుబ్బారావు రూ.లక్ష చొప్పున విరాళాలు ఇచ్చారు. వెలంగ భాస్కర్ రూ.50 వేలు అందజేశారు.

టీడీపీ కార్యాలయ దాడి కేసు విచారణ వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మంగళగిరి టీడీపీ కార్యాలయంపై దాడి కేసును పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసులో వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, దేవినేని అవినాశ్ సోమవారం మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజర య్యారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యాలయంపై దాడికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2021 అక్టోబరు 19న వైసీపీ శ్రేణులు టీడీపీ కార్యాలయంపై దాడికి దిగారు. దానిపై చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే దర్యాప్తు చేపట్టింది. కారణాలను ఆరా తీస్తున్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్ : దాడి కేసులో ప్రధాన నిందితుడు (ఏ1)గా ఉన్న పానుగంటి చైతన్య మంగళగిరి కోర్టులో లొంగిపోయారు. న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. రూరల్ పోలీసులు అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా... వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి అనుచరుడిగా పోలీసులు భావిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయి... ఇప్పుడు కోర్టులో లొంగిపోయారు. టీడీపీ కార్యాలయం, సీఎం చంద్రబాబు నివాసం దాడి ఘటనల కేసులను సీఐడీకి అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసింది. దీంతో ఈ రెండు కేసుల దర్యాప్తునకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ దాడుల వెనుక గత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణరెడ్డి హస్తం ఉందనే ఆరోపణలున్నాయి.

బెంగాల్ వైద్యులకు మద్దతుగా నేడు నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-విజయవాడ: బెంగాల్‌లో జూనియర్ వైద్యులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని వైద్య కళాశాలలు, ముఖ్యపట్టణాల్లో మంగళవారం నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్టు జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ చైర్మన్ డాక్టర్ కిరణ్, వైద్య విద్యార్థుల నెట్‌వర్క్ అధ్యక్షుడు డాక్టర్ కాలేశా సాహెబ్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయేంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్ సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. బెంగాల్‌లో వైద్య వ్యవస్థను పట్టిపీడిస్తున్న లంచగొండితనం, మాదకద్రవ్యాలు, వైద్యుల రక్షణ లోపాలు, వైద్యులపై పెరుగుతున్న దాడులు నిరసన దీక్షలకు కారణమని పేర్కొన్నారు. బెంగాల్లో జూనియర్ వైద్యుల నిరవధిక నిరాహార దీక్షల వలన అస్వస్థతులైన ముగ్గురు విద్యార్థుల ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నందున బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సత్వరం అక్కడి వైద్యుల డిమాండ్‌లను పరిశీలించి సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన వస్తువులే బీఐఎస్ లక్ష్యం

సంస్థ సీనియర్ డైరెక్టర్ వినోద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలుగల వస్తువులు అందుబాటులోకి తేవడమే భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) లక్ష్యమని సంస్థ రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ ఎంఏజే వినోద్ అన్నారు. బీఐఎస్-విజయవాడ అధ్వర్యంలో సోమవారం హయత్ హోటల్లో ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి వస్తువు కొనుగోలులో బీఐఎస్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు ఉన్నాయా, లేదా అనేది వినియోగదారులు సరిచూసుకోవాలని వినోద్ సూచించారు. ఇందుకోసం బీఐఎస్ కేర్ యాప్ సేవలను వినియోగించుకోవాలన్నారు. లోపాలు కనిపిస్తే ఫిర్యాదు చేయాలని, తద్వారా తగిన నష్టపరిహారాన్ని ఫిర్యాదుదారులు పొందవచ్చని, నాణ్యతలేని వస్తువుల విక్రయాలను నిరోధించవచ్చని చెప్పారు. బీఐఎస్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 20న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని 'క్వాలిటీ వాక్' అనే నినాదంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉత్తమ నాణ్యత ప్రామాణాలు పాటించిన తయారీదారులను ఆ రోజున సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో శర్మ సిలిండరీస్, గ్రూప్ కంపెనీల చైర్మన్ జీవీఎస్ శర్మ, ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డ్ నుంచి ప్రసాద్, వివిధ విభాగాల నుంచి ప్రొఫెసర్ వై.ప్రసాద్, వెంగళ జగదీశ్, బీఐఎస్ అధికారులు సాయి కౌశిక్, డి.అఖిల్, ఎస్వీఎస్ భవన్ నారాయణ, ఎస్.పద్మలత, కృష్ణవీర్, పారిశ్రామిక వేత్తలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం టెండరుదారుడి కిడ్నాప్

విశాలాంధ్ర-పుట్టపర్తి: మద్యం టెండర్లలో దుకాణం దక్కించుకున్న వ్యాపారి కిడ్నాప్‌నకు గురయ్యాడు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలకు సోమవారం అధికారులు లాటరీ నిర్వహించారు. అందులో భాగంగా పుట్టపర్తి ప్రాంతంలో మద్యం లాటరీల కార్యక్రమం సాయి ఆరామంలో నిర్వహించారు. లేపాక్షి షాప్ నెంబర్ 57 దక్కించుకున్న రంగనాథ్ అనే వ్యక్తి డిపాజిట్ నగదు తీసుకురావడానికి వెళ్తుండగా కిడ్నాప్ జరిగింది. పుట్టపర్తి నుంచి ఆయన లేపాక్షి వెళుతుండగా ఆగంతకులు ఆ వ్యాపారిని కిడ్నాప్ చేశారు. దీంతో రంగనాథ్ కుటుంబ సభ్యులు సాయి ఆరామం ఎదుట ధర్నాకు దిగారు. టెండర్‌దారుడు రంగనాథ్ భార్యకు కిడ్నాపర్ ఫోన్ చేసి... డబ్బులు డిమాండ్ చేశాడు. ఇందుకు మీకు అంగీకారమేనా అంటూ బేరమాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వ్యతిరేకంగా రంగనాథ్ టెండర్ వేయడం వల్లే కిడ్నాప్ చేయాల్సి వచ్చిందని ఫోన్లో కిడ్నాపర్ చెప్పాడు. రంగనాథ్‌కు ఎటువంటి హాని తలపెట్టబోమని, డబ్బు ఎక్కడ ఇవ్వాలో నువ్వే నిర్ణయించుకోవాలని కిడ్నాపర్ ఫోన్లో బెదిరించాడు.

ఏరిస్ ఆగ్రో లిమిటెడ్

ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ, తమ 100 శాతం నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు కె-ఫోసిట్ (NPK 00:12:45), HD NPK (11:52:00) + జింక్, సోయాబీన్ & పప్పు ధాన్యాల పంటల కోసం ప్రత్యేకంగా సూత్రీకరించిన మేజర్‌సోల్ - సోయాబీన్ & పల్సెస్ స్పెషల్ NPK (00:12:18) అను తమ ఉత్పత్తులను ఈ బ్రాండ్ల పేర్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విక్రయించాలని ఆశిస్తుంది.

క్ర.సం.	సాధారణ పేరు	బ్రాండ్ పేరు	లభ్యమగు పోషకములు
1.	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువు (NPK 00:12:45)	కె-ఫోసిట్	• తేమ % , గరిష్ఠంగా : 0.5% • నీటిలో కరిగే భాస్వరం "P_2O_5" రూపంలో : 12.0% • నీటిలో కరిగే పొటాషియం "K_2O" రూపంలో : 45.0% • ఇతర మిశ్రమాల బరువు గరిష్ఠంగా క్లోరైడ్ మొత్తం : 1.5% • నీటిలో కరగని పదార్థం : 0.5%
2.	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువు HD NPK (11:52:00)	HD NPK (11:52:00) + జింక్	• తేమ % , గరిష్ఠంగా : 0.5% • నీటిలో కరిగే భాస్వరం "P_2O_5" రూపంలో : 52.0% • నీటిలో కరిగే నత్రజని "N" రూపంలో : 11.0% • జింక్ "Zn" రూపంలో : 1.0% • ఇతర మిశ్రమాల బరువు గరిష్ఠంగా క్లోరైడ్ మొత్తం : 1.5% • నీటిలో కరగని పదార్థం : 0.5%
3.	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువు NPK (00:12:18)	మేజర్‌సోల్ - సోయాబీన్ & పల్సెస్ స్పెషల్	• నీటిలో కరిగే భాస్వరం "P_2O_5" రూపంలో : 12.0% • నీటిలో కరిగే పొటాషియం "K_2O" రూపంలో : 18.0% • కాల్షియం (Ca - EDTA) రూపంలో : 2.0% • మెగ్నీషియం "Mg" రూపంలో : 2.0% • బోరాన్ "B" రూపంలో : 0.2% • కాపర్ "Cu" రూపంలో : 1.0% • మాంగనీస్ "Mn" రూపంలో : 1.0% • జింక్ "Zn" రూపంలో : 2.5% • సల్ఫేట్ సల్ఫర్ "S" రూపంలో : 8.0%

పైన పేర్కొన్న 100 శాతం నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ (భారతదేశం) ద్వారా జారీ చేయబడిన నోటిఫికేషన్ నెం. S.O.2900 (E) తేది 24.10.2015, సవరించిన నోటిఫికేషన్ నెం. S.O.4120 (E) తేది 30.12.2017కు అనుగుణంగా ఖచ్చితంగా ఉంటాయి.

తయారీదారులు & మార్కెటింగ్ చేయువారు : M/s. **ఏరిస్ ఆగ్రో లిమిటెడ్**
సర్వే నెం. 69/1C, CIPET కాలేజ్ ఎదురు రోడ్డు, విజయవాడ గుండి గూడివాడ రోడ్డు, సూరంపల్లి గ్రామము, గన్నవరం మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521 212.

తేది : 15.10.2024

సంపాదకీయం

ఏదీ ఉచిత ఇసుక?

గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఉచిత ఇసుక పేరుతో జనాన్ని దోచుకున్నారనీ, తాము అధికారంలోకి వచ్చాం కనుక ఆ పరిస్థితిని సమూలంగా మార్చివేసి ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనలు నీటిమూటలుగా మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యోద్యమంలో చేసిన ఉప్పుసత్యాగ్రహాన్ని గుర్తుచేసుకుంటూ ఇప్పుడు రాష్ట్రంలో ఉచిత ఇసుక కోసం సత్యాగ్రహం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదనడంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఇసుక నూతన విధానం ప్రకటించిన తర్వాత వారానికి ఒక్కరోజు అదికూడా అర్ధరాత్రి సమయంలో మాత్రమే ఆన్‌లైన్ ఓపెన్ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇసుకను పూర్తి పారదర్శకంగా సరఫరా చేస్తున్నా తప్పుడు ప్రచారం చేస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అందుబాటులో లేకపోవడంపై సామాజిక మాధ్యమం వేదికగా నిలదీయడంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ అదంతా అసత్య ప్రచారం అని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని గనులశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంపై ఉద్దేశపూర్వకంగా అబద్ధాలతో ప్రజల్లో అనుమానాలు రేకెత్తేలా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బేస్ లెవల్ స్థాయిలో ఒక ట్రాక్టర్ ఇసుక గతంలో రూ.4.500కే వచ్చేది ఇప్పుడు దాదాపు రూ.7.500 వరకు పెట్టినా దొరకడంలేదు. లారీ ఇసుకకు రూ.25 వేలు చెల్లించాల్సి వస్తోంది. బస్తా ఇసుక రూ.200, కిలోకు రూ.4 ఖర్చవుతోందని చెపుతున్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా పెరిగిపోయిందనీ, సిమెంట్ కంటే ఇసుక ధర ఎక్కువైందన్న వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. వర్షాకాలం ముగిసే వరకూ నదీగర్భాల్లో రీచ్‌లు పనిచేయకపోవడం వల్ల స్టాక్‌యార్డుల సంఖ్య జులైలో 86 నుంచి 14కు తగ్గింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి, కనీసం చిన్నచిన్న మరమ్మతులకూ కూడా ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. నిర్మాణ కార్యకలాపాలు నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, ఇతర రంగాలవారు చేస్తున్న ఆందోళనలు ఉచిత ఇసుకపై రాష్ట్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని ప్రతిబింబిస్తోంది. ఇసుకను నిత్యావసర వస్తువుగా భావించి సరఫరాకు ఉన్న అన్ని సమస్యలనూ తొలగించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్నట్టు కనిపించడంలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇసుక విధానం జగన్ హయాంలో కన్నా చాలా ఘోరంగా ఉందన్న విమర్శలున్నాయి. టీడీపీ అధికారం చేపట్టిన తర్వాత ఇసుక ఉచితంగా అందజేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత అమలు చేయడంలో చంద్రబాబు తీవ్రంగా విఫలమయ్యారు. దీంతో రాష్ట్రంలో ఇసుక ధరలు గతంలో కంటే విపరీతంగా పెరిగిపోవడమేకాకుండా ఇసుక అందుబాటులో ఉండకపోవడంతో నిర్మాణ పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. తత్ఫలితంగా భవన నిర్మాణకార్మికులు, ఆ రంగంపై ఆధారపడిన ఇతర రంగాల కార్మికులు పనులులేక రోజువారీ జీవననౌకను నడపడంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత ఇసుక కోసం ఆందోళనకు దిగుతున్నారు. కలెక్టరేట్లు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. 'బాబూ ఏదీ ఉచిత ఇసుక, ఎక్కడ ఉచిత ఇసుక' అని నిలదీస్తున్నారు. ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ రంగాన్ని కాపాడాలని, నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని, పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక భారం తగ్గించాలన్న వారి డిమాండ్‌లో న్యాయం లేకపోలేదు. వర్షాకాలం తరువాత ఇసుక సరఫరా కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని రాష్ట్ర భూగర్భ గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా కొద్ది రోజుల క్రితం తెలిపారు. ఇసుక లభ్యతను పెంచేందుకు జారీచేసిన జీఓ 59 ప్రకారం పట్టా భూముల నుంచి ఇసుక తవ్వకాలకు కూడా అనుమతి ఉందనీ, ఈ నెల 15 నుంచి స్టాకు యార్డులు డి సిల్టేషన్ పాయింట్లు, రీచ్‌ల ద్వారా ఇసుక డిమాండ్లను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 70 లక్షల టన్నుల సామర్థ్యంతో 108 రీచ్‌లు మాన్యువల్ పద్ధతులను ఉపయోగించి పనిచేయించడం వల్ల అన్ని జిల్లాల్లో సరఫరా పెరుగుతుందన్న ఆశాభావంతో అధికారయంత్రాంగం ఉంది. ఇసుక బుకింగ్ సౌలభ్యతను మెరుగుపరిచేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌తోపాటు రీచ్‌ల వద్ద నేరుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లైతే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోలేని వారు కూడా ఇసుక పొందడం సులభమవుతుంది. ఈ ప్రక్రియలో ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. ఇసుక లభ్యత, రవాణా, ఆపరేషన్ ఖర్చులు మొదలైన వాటి గురించి ప్రజలకు అధికారులు ఎప్పటికప్పుడు వాస్తవ సమాచారం అందచేయాలి. తనిఖీ, జీపీఎస్, ట్రాకింగ్, ఆడిట్ విధానాలతో బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చూడాలి. అప్పుడే ఇసుక సరఫరాపై గందరగోళం తొలగే అవకాశంవుంటుంది. రాష్ట్రంలో ఈ నెల 16వ తేదీ నుంచి 70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 108 రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయని అధికారులు చెపుతున్నారు. ఇసుక రీచ్‌ల సంఖ్య పెంచేందుకు రానున్న రోజులలో ప్రైవేటు వ్యక్తులు కూడా మైనింగ్‌శాఖ అనుమతితో తవ్వకాలు ప్రారంభిస్తారంటున్నారు. ప్రైవేటు ఇసుక రీచ్‌లలో కూడా డీఎల్ఎస్‌సీ నిర్ణయించిన ధరకే ఇసుక విక్రయాలు జరిగేలా చూడాలి.

ఊహలకు అందని మాస్టర్ స్కెచ్‌తో ఇసుకను దోపిడీ చేస్తున్నారని తన అనుభవాన్నంతా రంగరించి దోపిడీకి చంద్రబాబు పథకం పన్నారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. 2014-19 మధ్యలో కూడా ఇదే కూటమి ప్రభుత్వం ఇసుక విధానం కోసం 19 జీవోలు ఇచ్చిందనీ, ఎమ్మెల్యేలు, నాయకులకు ఎలా దోచిపెట్టవచ్చో చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇసుక ఉచితంగా ఇస్తామని ఊరూర డప్పుకొట్టి మరీ ప్రచారం చేశారు ఇప్పుడు ఉచిత ఇసుక ఎక్కడైనా దొరుకుతోందా? అని ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీస్తున్నారు. 2014-19 మధ్య ప్రభుత్వ ఖజానాకు ఒక్క రూపాయి కూడా ఆదాయం రానీయకుండా పక్కా అవినీతి పథక రచనతో ఇసుకను దోచేసిన తీరు ఇప్పుడు పునరావృతం అయ్యిందన్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం కొట్టిపారేస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇసుక సరఫరాపై దృష్టి సారించి ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలి. జగన్ హయాంలో కంటే ఇసుక విధానం ఘోరంగా ఉందన్న అప్రపదను తొలగించుకోవాలి. గతంలో కంటే ఇసుక ధరలు విపరీతంగా పెరిగిపోవడానికి మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలే కారణమన్న ఆరోపణలపై నిజం నిగ్గుతేల్చాలి. బాధ్యులని తేలినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ రంగాన్ని కాపాడాలని, నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి, పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక ధర భారం తగ్గించాల్సిన అవసరం ఉంది. అక్రమ మైనింగ్ రవాణా నియంత్రణకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను బలోపేతం చేయాలి.

స్థలపురాణం

చింతపట్ల సుదర్శన్

ఎర్రరంగు ముఖానికి పూసుకున్న సూరీడు కొండల చాటుకు వెళుతున్నప్పుడు అరుగు ఎక్కింది డాగీ. ఎప్పట్లాగే తన జాగాలో కూచుందామనుకుంది కానీ ఎదురుగ్గా ఖాళీగా ఉన్న డాంకీ సీటు కనిపించింది. ఎప్పుడూ కూచున్న చోటే కూచోడం చిరాగ్గా అనిపించింది. ఇదేమన్నా పి.ఎం. సీటా, సి.ఎం.సీటా, గబ్బిలంలా పట్టుకు కూచోడానికి, చచ్చేదాకా వదలకుండా ఉండడానికి, చావకుండా వేలాడ్డానికి అనుకుంది. ఇవాళ్ళ డాంకీ కూచునే చోట కూచుందాం. కొత్తగా ఉంటుంది. అనుకున్న డాగీ, డాంకీ కూచునే చోట నుంచుని, కూచుని, ఒళ్ళు విరుచుకుని తోకని లాక్కునీ పీక్కునీ నడుం వాల్చేసింది.

చూస్తుండగానే చీకటి నల్లటి గొడుగు విప్పి పట్టుకునే టైం అయింది అనుకుంటూ అరుగు ఎక్కింది డాంకీ. డాగీ కూర్చునే జాగా ఖాళీగా కనిపించింది. ఎక్కడ పెత్తనాలు చేస్తున్నదో రూలింగ్ పార్టీ కార్యకర్తలాగా అనుకుంటూ తను కూర్చునే చోటువైపు అడుగువేసి 'ఫ్రీజ్' అయింది. ఎవరు? ఎవరు? నా శాశ్వత చిరునామా మీద కన్నేసిందెవరు? నా పర్మినెంట్ రెసిడెన్స్‌ని ఆక్రమించిందెవరు అని కళ్ళు వెడల్పు చేసి చూసింది.

ఆ ఎవరు ఎవరో మరెవరో కాని వారెవరో కానేకాదు. తన ఫ్రెండే. తన మిత్రపక్షమైన ఏకైన జీవి డాగీనే. పిదపకాలం పిదప బుద్దులూ

రంగస్థలం

గుర్రుకొడుతున్నది. వెనక్కు తిరిగి 'లెగ్‌షాట్' ఒకటిచ్చుకుందామా అనుకుంది కానీ స్వపక్షాన్ని, విపక్షంగా మార్చుకోవడం మంచీ మర్యాదా లేకపోవడం అవుతుందని చిన్నగా సకిలించింది. గాడిదకదా గుర్రంలా సకిలించిందేమిటి అనుకోనక్కర్లేదు. దాని శబ్దానికా పేరు పెట్టారు. దీని ధ్వనికి మరో పేరు పెట్టారు కానీ ఇదీ సకిలింపే. ఉలిక్కిపడి లేచింది డాగీ. అసెంబ్లీలో నిద్రపోతున్న సభ్యుడు 'హేండ్ రెయిస్' చేయాల్సిన సమయంలో పక్కవాడు డొక్కలో పొడిస్తే ఉలిక్కిపడి లేచినట్టు 'అబ్బ ఏమిటి బ్రో! మంచి నిద్రపాడు చేశావు' అంది డాగీ కళ్ళు తెర్చి, ఉన్న చోటునుంచి కదలకుండానే.

ఇంకా నయం 'చందమామ రావే జాబిల్లి రావే' అని పాడుతూ నిద్రపుచ్చమనలేదు. లే...లే.. ఎన్నడూ లేంది నా జాగా 'ఆక్యుపై' చేశావేం అంది డాంకీ. 'నాది నాది అనుకున్నది నీది కాదురా' అన్న పాట విన్లేదూ. అయినా ఎవరైనా ఎల్లకాలమూ ఒక్కచోటే ఉండాలా? అధికార పక్షం ప్రతిపక్షంలో కూచున్నప్పుడు ప్రతిపక్షం అధికార పక్షంలో కూచోక తప్పదుకదా. మన ఓటర్లకు వీళ్ళని వాళ్ళని చెయ్యడం, వాళ్లని వీళ్ళని చెయ్యడం తప్ప మరో మార్గమేదీలేదుకదా. ఇందులోని వాళ్ళు, అందుగల వాళ్ళు ఇందులోకి దూకుతారని వాళ్ళయినా వీళ్ళయినా అసలు బ్రహ్మపదార్థం ఒక్కటేనని తెలిసీ ఏమీ చెయ్యలేరు కదా అంది డాగీ.

చదివేస్తే ఉన్న మతి పోతుందంటారు. నువ్వు ఏమీ చదవకుండానే నా మతి పోగొట్టేటట్టున్నావ్. ఈ సురేంద్ర నాథ్ బెనర్జీ మార్కు ఉపన్యాసం వదిలేసి, నా జాగాకూడా 'వెకేట్' చేసి పో అంది డాగీ విసుక్కుంటూ. అందేటి బ్రో అంత కోపమెందుకు. ఈ సీట్లో కూచుని నేనేం రాజ్యం చెయ్యబోవడం లేదు అంటూ లేచి డాగీ నడిచింది. తను కూచునే చోటికి, పైసా సంపాదించే చోటుకాదు, పదిమందిని శాసించే చోటూకాదు దీనికే ఎంత మిడిసిపాటు అనుకుంటూ.

డాంకీ తన సీట్లో తను డాగీ తన చోటులో తను సెటిలవుతుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి. ఏవిటి విశేషం ఇటువారటు, అటు వారిటు పార్టీ, అదే జాగా మారుస్తున్నారు అన్నాడబ్బాయి నవ్వుతూ, మార్చడం అయింది తిరిగి యథాస్థానాల్లోకి వస్తున్నాం అంది డాంకీ.

కొత్తగా మంత్రి పదవి వచ్చిన వాళ్ళు చేంబర్‌లో ఏ పక్క సీటు వేసుక్కూమంటే బాగా గిట్టుబాటు అవుతుందో, మళ్ళీ ఎలెక్షన్‌లో ఖర్చు పెట్టేందుకు కాసుల వర్షం కురుస్తుందో, గ్రహాల మూవ్‌మెంటు తెల్సిన 'స్వాము'ల్ని అడిగి ఫాలో అవుతారు అన్నాడు అబ్బాయి. కాసుల వర్షం అంటే గుర్తొచ్చింది. ఇప్పుడు మందుషాపుల టెండర్లకు కురుస్తున్నదటగదా. ఈ నెల పదహారు నుంచి మందుబాబుల జేబులకు చిల్లు, ప్రభుత్వ ఖజానా ఫుల్లు అంతేకదా అంది డాంకీ. అసలు విషయాన్ని నమిలేయకు మందులేనిది సర్కార్లు నడవడం కాదు కదా 'దేకడం' కూడా చెయ్యలేవన్నది జగమెరిగిన సత్యం అదివదిలెయ్. నేను నీ జాగాలో కూచోవడం, నీ ముత్తాత ముల్లె ఏదో పోయినట్టు నన్ను లేపి పంపెయ్యడం సంగతి చెప్పు అంది డాంగీ ముక్కు ఉబ్బిస్తూ.

వచ్చేదీ లేదు పోయేదీ లేదు ఆఫ్టరాల్ స్థలంకోసం మనమధ్య గొడవ అవసరమా అంది డాంకీ. ఇంత చిన్న విషయానికి నారిమన్‌లూ, సింఘ్వీలు, సిబల్లూ అవసరమా. మనిషికీ, గొడ్డుకీ తేడా లేదూ. సీటుకోసం మనుషులు చేసే ఛండాలం అంతా ఇంతాకాదు. కొంతరు సీ.ఎంలు ముఖ్యమైన పోర్టుఫోలియోలన్నీ తామే ఉంచేసుకుంటారు. ఎక్కడ అసలుకే ఎసరు వస్తుందోనని భయపడి అన్నాడు అబ్బాయి. అవునవును ఒక్కసారి ఎత్తయిన సీటుమీద కూచున్న వాళ్ళకు అంతా చీమల్లాగే కనిపిస్తారు. ఈ మధ్య ఓ సబలా మంత్రి, పోలీస్‌స్టేషన్లో సీ.ఐ.సీట్లో కూచుని ఆ ఖాకీచేత 'గుంజిళ్ళు' తీయించిందట అన్నది డాంకీ మంత్రి గారా మజాకా ఏ ఆఫీసుకు వెళ్ళినా అక్కడి ఉన్నతాధికారి బిళ్ళ బంట్రోతులా, కుర్చీ అప్పచెప్పి చేతులు కట్టుకు నిలబడాల్సిందే అన్నాడు అబ్బాయి.

ఈ జాగా నీకు అంత నచ్చిందయితే రా! ఇక్కడే పడుకో మన్లోమనకు మనుషుల్లా, ఈర్ష్యా అసూయా ద్వేషం ఎందుకు? అంది డాంకీ.

సారీ డాంకీ బ్రో. మనుషులకూ మనకూ తేడా ఉండాలి కదా! ఊరికే సరదా పడ్డానంతే. నాకు ఇక్కడే బాగుంది. 'థాంక్యూ' అంది డాగీ.

మోదీ పాలనలో పేదరికమే వృద్ధి



చలసాని వెంకటరామారావు

'కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి' అన్నట్లు ఉంది ప్రస్తుతం దేశంలో ధరవరల పరిస్థితి. 'పేరుగొప్ప ఊరు చూస్తే దిబ్బ' అన్నట్లు భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో మూడవ స్థానం చేరుతుందని ప్రధానమంత్రి పదేపదే ఊదరకొడుతున్నాడు. ప్రస్తుతం దేశం 3.7 ట్రిలియన్ డాలర్లతో ఐదవస్థానంలో ఉంది. మన దేశంలో నేడు 534 మంది బిలియనీర్లు ఉన్నారు. ఒక్క సంవత్సరంలో 75 మంది బిలియనీర్లు పెరిగారు. వెయ్యికోట్లపైబడిన సంపద ఉన్నవారి సంఖ్య 1539. దేశంలో సంపన్నుల వద్ద ఉన్న నల్లధనాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే వెయ్యికోట్లు దాటినవారు ఐదువేల మందికిపైగా ఉంటారు. దేశంలో జనాభా 143 కోట్ల మందిలో సంపద పంపిణీ చాలా వక్రంగా ఉంది. దేశ సంపదలో అత్యధిక భాగం కొద్దిమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లి ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. ఒక పక్కన సంపద పెరుగుతున్నా పేదరికం కూడా పోటీపడి పెరిగిపోతున్నది. దేశ ఆర్థిక విధానాలలో లోపంవల్ల ఆకలి సూచీలో 191దేశాలలో మనం 127వ స్థానంలో నిలిచాం. దేశం మూడో ఆర్థికశక్తిగా ఎదిగినప్పటికీ జి-7 దేశాలలో భారతదేశం పేద దేశంగానే మిగిలిపోయింది. ఒక వంక ఆదాయాలు పెరిగినట్లు కన్పిస్తున్నా ధరల పెరుగుదలవల్ల ప్రజల నిజ ఆదాయాలు క్షీణించి పోతున్నాయి. వ్యవసాయరంగం సైతం రోజురోజుకు సంక్షోభాలను ఎదుర్కొంటున్నది. ప్రకృతి వనరులు, అనుకూల వాతావరణం మంచి దిగుబడులు ఉన్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధరలు లేక, ఆదాయం పెరగక, ఉత్పత్తి ఖర్చులుపెరిగి నష్టాలతో సాగుచేస్తున్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్‌శక్తుల చేతులలో బందీలై మద్దతు ధరలను పెంచకపోవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత్యంతరంలేని స్థితిలో పరపతికోల్పోయి అవమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనికితోడు పారిశ్రామిక ఉత్పత్తిరంగ సామర్థ్యం రోజురోజుకు తగ్గిపోతున్నది. ప్రభుత్వరంగాన్ని పాలకులే నిర్దాక్షిణ్యంగా పీక నులిమి చంపి వేస్తున్నారు. అసంఘటిత రంగంలోని కోట్లాదిమంది శ్రామికుల సంక్షేమం పాలకులు విస్మరించటం, కనీస వేతనాలు దీర్ఘకాలంగా పెరగకపోవటంతో ఆదాయాలు తగ్గి కొనుగోలుశక్తి క్షీణించటంతో పారిశ్రామికరంగంపై ప్రభావంపడి పరిశ్రమలు మూతపడుతున్నాయి. దానితో నిరుద్యోగసైన్యం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. దీనితో వలస కార్మికుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. చట్టాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వాలు స్కీం వర్కర్లు పేరిట, ఫిక్స్‌డ్ టైం ఎంప్లాయిమెంట్ పేరుతో శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. దీర్ఘకాలంపాటు మూసివేసిన పరిశ్రమలు తెరిపించే నాధులులేక ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం అవుతున్నది. ఈ నేపథ్యంలో దేశంలో వస్తువుల కొరత ఏర్పడి నిత్యజీవితావసరాలతో సహా అన్ని వస్తువుల ధరలు పెరిగి అత్యధిక జనాభా ఈతి బాధలు అనుభవిస్తున్నారు. ధరలు నియంత్రించవలసిన ప్రభుత్వాలు వ్యాపారధోరణితో వ్యవహరించటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆకలిబాధలు అనుభవించవలసి వస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు బజార్లుసైతం ధరలు పెంచటంలో పోటీ పడుతున్నాయి. వాటిపై నియంత్రణ కొరవడింది.

1955లో అత్యవసర వస్తువుల ధరల చట్టం వచ్చింది. అయినా దేశంలో వ్యాపారవర్గాల గుత్తాధిపత్యం నడుస్తూనే ఉన్నది. నల్లబజారు వ్యాపారానికి హద్దులు లేకుండా ఉంది. దీని ఫలితంగా అత్యవసర వస్తువుల అక్రమ నిల్వలు పెరిగి కృత్రిమ కొరత సృష్టించి ధరల పెరుగుదలకు కారణమవుతున్నది. అత్యవసర వస్తువులైన కూరగాయలు, పండ్లు, మాంసం, గుడ్లు, పాలు, పప్పుల ధరలు అదుపులేకుండా పెరిగిపోతున్నాయి. ధరల పెరుగుదల వల్ల ప్రజల ఆదాయానికి గండి పడుతున్నది. దీనితో ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్నదంటే ధరలు పెరుగుతున్నాయని అర్థం. ఈ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల వ్యాపారవర్గాలకు కూడా దెబ్బే. ఫలితంగా చిన్న, మధ్యస్థాయి వ్యాపారాలు దెబ్బతింటాయి. ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతే వ్యాపారాలు మూతబడి వస్తువుల నిల్వలు పెరుగుతాయి. దీనివల్ల ఉత్పత్తి ప్రక్రియకు ఆటంకం కలుగుతుంది. అంతిమంగా పరిశ్రమలు మూతబడి, ఉపాధికోల్పోయి నిరుద్యోగంతోపాట సంక్షోభం ఏర్పడుతుంది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం, ముందుచూపు కొరవడడంవల్ల వంటనూనెల ధరలు పెరిగిపోతున్నాయి. మన దేశం వంటనూనెల దిగుమతిలో ప్రథమస్థానంలో ఉంది. కేంద్రప్రభుత్వం వంటనూనెల దిగుమతులపై భారీ స్థాయిలో పన్నులు విధించింది. ఈ రంగంలో స్వయంపోషకత్వం లోపించినందున భారీగా ధరలు పెరిగాయి. 2019తో పోల్చితే వంద శాతం నూనెల ధరలు పెరిగాయి. ముడి పామాయిల్, సోయా, పొద్దుతిరుగుడు వంటి ఖాద్యతైలాలపైఉన్న దిగుమతి సుంకాన్ని 5.5శాతం నుంచి 27.5శాతానికి పెంచారు. దీనితో మధ్యతరగతి మహిళలను బాండీలోవేసి వేయించినట్లుగా ఉంది. అంతేగాక, మార్కెట్‌లో కల్తీ నూనెలు రాజ్యమేలుతున్నాయి. ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం పొంచివుంది. పెట్రోలు ఉత్పత్తుల ధరలు పెరిగి ఆటో, సరకు రావాణా చార్జీలు పెరిగాయి. గతంలో ఒక కుటుంబం పెట్రోలు ఖర్చు నెలకు రెండువేలు ఉంటే ఇప్పుడు అది రెట్టింపును దాటిపోయింది. 2019లో కిరాణా సరుకుల బిల్లు మూడువేలు ఉంటే ప్రస్తుతం ఎనిమిది వేలకు పెరిగిపోయింది. విద్యార్థుల స్కూలు ఫీజులు, పుస్తకాలు, కాస్మోటిక్స్ ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ చేతలుడిగి నిర్వీర్యమైపోయాయి. ఐదుకిలోల బియ్యం, అరకిలో పంచదారకు మాత్రమే పరిమితమైపోయింది. వంద కార్డులు ఉంటే 10,20 కార్డులకు మాత్రమే కందిపప్పు ఇస్తున్నారు. ఉల్లిపాయల ధరలు గత కొద్దిమాసాలుగా ఆకాశాన్ని అంటాయి. ఒక పక్కన రైతులకు గిట్టుబాటుధర రావటంలేదు. కానీ బ్లాక్ మార్కెట్ పెరిగిపోయి వినియోగదారులు అధికధరలు చెల్లించాల్సి వస్తున్నది. దేశంలో వేరుశనగ దిగుబడి తగ్గిపోయింది. సాగు విస్తీర్ణం పడిపోయి ధరలు అందనంత ఎత్తుకు పెరిగిపోయాయి. నూనెగింజల ఉత్పత్తికీ, పప్పు గింజల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహం కొరవడి, కొరత పెరిగిపోతున్నది. వ్యవసాయరంగంలో ఆహార వస్తువుల ఉత్పత్తి సామర్థ్యం పడిపోవటంతో కొరత ఏర్పడి ధరలు పెరిగిపోతున్నాయి. దీనికితోడు వంటనూనెల వ్యాపారంలో అదానీ కంపెనీలు ప్రవేశించడం వల్ల కూడా ధరలు పెరిగిపోతున్నాయి.

> భారతదేశంలో 11ఏళ్ల గరిష్టసాయికి ధరలు పెరిగిపోయాయి. మూడవసారి మోదీ అధికారం చేపట్టడం వ్యాపారవర్గాలు తమ ప్రభుత్వం వచ్చిందని తమకు ఎదురులేదని భావించి బ్లాక్ మార్కెట్‌కు ద్వారాలు తెరిచి ధరలను కళ్లెంలేని గుర్రాలుగా మార్చివేశారు. దీనితోడు ప్రభుత్వ పన్నుల భారం సామాన్యులను క్రుంగదీస్తున్నది. దేశంలో ప్రకృతి వైపరీత్యాలు, అధికవర్గాల వల్ల కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. 2019తో పోల్చితే వంద శాతం నూనెల ధరలు పెరిగాయి.

దీనికితోడు పట్టణాలలో ఆస్తిపన్నులు, చెత్తపన్ను, విద్యుత్ ఛార్జీలు, వినోద పన్నులు, జిఎస్‌టి వంటి భారాలతో సామాన్యుల నడ్డి విరిగిపోతున్నది. విద్య వైద్యం ఖర్చులు పెరిగిపోయాయి. బస్సులు, రైలు, విమానం చార్జీలు కూడా భారంగా పరిగణించాయి. అత్యవసర మందుల ధరలు నెలనెల మారిపోతున్నాయి. వంట గ్యాస్, కూల్‌డ్రింక్‌లు, సిగరెట్లు వంటి వాటి ధరలు పెరిగిపోయాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇల్లు, ఒల్లు గుల్లచేసే మద్యం ధరలు మాత్రం తగ్గించి తాగుడు వ్యసనాన్ని ప్రోత్సహిస్తున్నది. మద్యం నియంత్రించకపోతే పేద కుటుంబాలు మరింత ఆర్థిక కష్టాలను అనుభవించవలసివస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన విపత్కర పరిణామాలు కూడా ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. ఇంధన ధరల పెరుగుదలవల్ల అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం పెరిగి ధరల పెరుగుదలకు దారితీస్తున్నది. దీనికితోడు సంవత్సరంపైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధప్రమాదం అంతర్జాతీయ మార్కెట్‌లపై ప్రభావం చూపిస్తున్నది. దీనికితోడు పశ్చిమాసియాలో ఇజ్రాయిల్-పలస్తీనా-ఇరాన్-లెబనాన్‌ల మధ్య ఏర్పడిన ఉద్రిక్తితలు, పరస్పరబాంబు దాడులు విధ్వంసం ఫలితాలే అంతర్జాతీయంగా ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచంలో అనేక ప్రాంతాలలో కోవిడ్ కారణంగా మూసివేసిన పరిశ్రమలు ఇంకా తెరవలేదు. దీనివలన కాంక్రీట్, స్టీల్, ప్లాస్టిక్ ధరలు పెరిగిపోయాయి. ఇసుక కొరత వివిధ దేశాలలో నిర్మాణ రంగాన్ని కుదేలుచేసింది. ఇంగ్లాండ్‌లో, అమెరికాలో కలపధరలు రెండింతలు పెరిగాయి. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు సైతం అధిక ధరలతో సతమతమవుతున్నాయి. అమెరికా, ఇంగ్లాండ్ యూరోపియన్ యూనియన్ దేశాలలో గ్యాస్‌కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. దీనికితోడు ఈస్ట్ అండ్ గల్ఫ్ పోర్టులలో సమ్మెలు జరిగి వస్తు రవాణా స్తంభించడంతో ధరల పెరుగుదల వేగం పుంజుకుంది. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం పెరగడంతో ఉపాధి అవకాశాలు సన్నగిల్లటం కారణంగా హోల్‌సేల్ ధరలు పెరిగిపోతున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వస్తువుల ధరలుపెరిగి ప్రజల జీవన ప్రమాణాలు తరిగిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో భారతదేశంలో 11ఏళ్ల గరిష్టసాయికి ధరలు పెరిగిపోయాయి. ఎన్నికలు జరిగి మూడవసారి మోదీ అధికారం చేపట్టడం వ్యాపారవర్గాలు తమ ప్రభుత్వం వచ్చిందని తమకు ఎదురులేదని భావించి బ్లాక్ మార్కెట్‌కు ద్వారాలు తెరిచి ధరలను కళ్లెంలేని గుర్రాలుగా మార్చివేశారు. దీనితోడు ప్రభుత్వ పన్నులభారం సామాన్యులను క్రుంగదీస్తున్నది. దేశంలో ప్రకృతి వైపరీత్యాలు, అధికవర్గాల వల్ల కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ధరలను నియంత్రించాల్సిన కేంద్రప్రభుత్వం మౌనం పాటిస్తున్నది. ప్రజలను, వ్యాపార వర్గాల దయాదాక్షిణ్యాలకు వదిలివేశారు. పెరిగే ధరలకు హద్దులేకుండా పోయింది. అయినా పాలకులు మౌన నిద్ర నటిస్తున్నారు. పాలకులను మేల్కొల్పాల్సిన కర్తవ్యం ప్రజలపై ఉంది. లేకుంటే దేశంలో ఆకలిచావులు తప్పని పరిస్థితులు రానున్నాయి.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093

క్రూరవ్యవస్థకు సాయిబాబా బలి

విద్యాభూషణ్ రావత్

రెండు రోజుల క్రితం ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మరణం మన న్యాయవ్యవస్థను వెంటాడుతూ ఉంటుంది. సాయిబాబా స్థాయిని న్యాయవ్యవస్థ చేరుకోలేకపోయింది. సాయిబాబా అనుభవించిన బాధను న్యాయవ్యవస్థ అర్థం చేసుకోలేకపోయింది. ఆయన 90శాతం అంగవైకల్యానికి లోనైనప్పటికీ, చివరికంటా గొప్ప విశ్వాసాలను విడవలేదు. ఇండియా 'కోరుకుంటున్న' గొప్ప వ్యక్తి ఆయన. అదే స్థాయిలో న్యాయవ్యవస్థ ఆమోదించిన వ్యక్తి. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు గల ప్రజలు ఉండవచ్చునని నేను అనేకసార్లు ప్రస్తావించాను. రాజ్యాంగ విలువలపట్ల విశ్వాసం, అదే సమయంలో ప్రజాస్వామ్యంపై అసమ్మతి గలిగినవారు చివరికి పటిష్టమవుతారు.

'మావోయిస్టులతో' సంబంధాలున్నాయని ఆరోపిస్తూ 2014 మే 9 వతేదీన మహారాష్ట్ర పోలీసులు సాయిబాబాను అరెస్టుచేశారు. 2015లో అనారోగ్యానికి వైద్యచికిత్స అవసరాన్ని గుర్తించి బొంబాయి హైకోర్టు బెయిలు మంజూరుచేసింది. అనంతరం బెయిల్ రద్దుచేసి ఆయనను జైలులో ఉంచగా, విడుదలకు అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ కోర్టులు తిరస్కరించాయి. 2017 సెషన్స్‌కోర్టు ఆయనకు జీవిత ఖైదు విధించింది. సాయిబాబాకు మంజూరుచేసిన మెడికల్ బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించింది. తల్లి చనిపోయినా ఆమె అంత్యక్రియలలో సాయిబాబా పాల్గొనేందుకు పెరోల్ మంజూరు చేయడానికి సైతం కోర్టు తిరస్కరించడం అత్యంత బాధాకరమైన విషయం. ఆయన అత్యంత పోరాట యోధుడు. జైలులో ఆయనను ఉంచిన గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ నిరాహారదీక్షను చేశారు. యూఏపీఏ చట్టం కింద బనాయించిన అనేక కేసుల నుంచి విముక్తిచేస్తూ బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచి 2022 అక్టోబరు 14వ తేదీన తీర్పు చెప్పింది. అయితే కేంద్ర ప్రభుత్వం నాగపూర్ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసింది. కేసును మళ్లీ విచారణ చేయాలని బొంబాయి హైకోర్టును సుప్రీంకోర్టు కోరింది. అయితే బొంబాయి హైకోర్టు

నాగపూర్ బెంచ్ తన తీర్పును ధృవీకరిస్తూ, ఆయనతోపాటు మరో ఐదుగురు ఖైదీల విడుదలకు 2024మార్చి 5వ తేదీన తీర్పుచెప్పింది.

తీవ్రమైన అనారోగ్యాలకులోనైనప్పటికీ వృద్ధుడైన ఫాదర్ స్టాన్‌స్వామికి కోర్టులు బెయిల్ తిరస్కరించినట్లుగానే ప్రొఫెసర్ సాయిబాబాకు కూడా బెయిల్‌ను కోర్టులు తిరస్కరించాయి. 'అధికార వర్గం' చెప్పినట్లుగానే మన న్యాయవ్యవస్థలో పరిస్థితి క్రూరంగానే ఉంది. దిగువ కోర్టులు దాదాపు ఎక్కువ సమయాల్లో అధికారం వర్గాలను ఏమీ ప్రశ్నించవు. అయితే బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచి సాయిబాబాను అన్ని కేసుల నుంచి విముక్తి చేసినప్పుడు, సుప్రీంకోర్టు, తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తి హక్కును గురించి మాట్లాడలేదు. మానవతావిలువల ఆధారంగా సైతం విడుదల చేయలేదు. చట్టం ఏమాత్రం మనసు లేకుండా అత్యంత క్రూరంగా ఉండవచ్చునా! 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' అన్నట్లుగా చట్టాన్ని ఎలా రూపొందించారు? ఇదే చట్టం గో రక్షకులుగా వ్యక్తులను చంపినా, విద్వేషాన్ని వెళ్లగక్కే వారిని, రేపిస్టులను, హంతకులను ఏ ప్రశ్నలు వేయకుండా ఎలా విడుదల చేస్తున్నది?

నాగపూర్‌లోని అత్యంత క్రూరమైన జైలులో సాయిబాబాను ఉంచారు. అక్కడ ఆయన తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నారు. సామాజిక న్యాయవ్యవస్థ పట్ల అంకితభావం గల వారిపట్ల ప్రభుత్వ అధికార యంత్రాంగం తమ అధికారస్థాయిపై ఏమాత్రం తగ్గకుండా మానసికంగా, శారీరంకగా హింసిస్తారు. ఎక్కువగా కదలికలులేని సాయిబాబాకు కనీసం ఒక సహాయకుడిని సైతం ఇవ్వలేదంటే ఆయనను ఎంతగా వేధించారన్న విషయం ఊహించవచ్చు. అత్యంత గౌరవంగా వినమ్రంగా జీవనం సాగించే వ్యక్తిని భారతదేశానికి అత్యంత ప్రమాదకారిగా చిత్రించడం దారుణమైన విషయం.

ఇంతకుమించి భారతదేశ అధికారయంత్రాంగం చేయగలిగిందేముంది? ప్రభుత్వ ప్రాధాన్యతలు స్పష్టంగా తెలిసినవే. ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తోంది. సోషల్ మీడియా తమకు అనుకూలమైనవారిని గొప్ప సంపన్నులుగా తయారుచేయడానికి పనిచేస్తోంది. భారతదేశంలో మధ్యతరగతి, పేదలు తమను గురించి పెద్దగా పట్టించుకోవడంలేదని మనం అర్థంచేసుకోవాలి. వెబ్ ప్రపంచం పక్కదారిపట్టించే ఎత్తుగడలను అనుసరిస్తోంది. మన భావాలను నియంత్రించే వారినుంచి స్వేచ్ఛగా ఉండాలని ప్రయత్నించినా అది సాధ్యంకావడంలేదు. మనం స్వేచ్ఛగా ఉండకుండా సోషల్ మీడియా పెద్ద ఆయుధంగా పనిచస్తోంది. ఎందుకంటే వీటిని పెట్టుబడిదారులు నియంత్రిస్తున్నారు. వీరు ప్రచారయంత్రాంగం ఎవరి జాతీయవాదులు? ఎవరు జాతీయవాద వ్యతిరేకులు? అని అది నిర్ణయిస్తోంది. అందువల్ల ప్రొఫెసర్ సాయిబాబా లేదా ఫాదర్ స్టాన్ స్వామి లేదా ఉమర్ ఖాలీద్ పట్ల మధ్య తరగతిలో, సామాజిక మేధావులు, రాజకీయ పార్టీలు ఏ మాత్రం సానుభూతిగా లేవు. ప్రజలు మౌనంగా ఉండటానికి వాస్తవంగా భయం, భయపెట్టడం లాంటివి కారణం. పెట్టుబడిదారులు ప్రభుత్వం తదితర దోపిడీదారులను 'సంపద సృష్టికర్తలు' అని ప్రచారం చేస్తున్నారు. వీరిలో అత్యధికులు ఆర్థిక దొంగలు. వీరు అత్యంత విలాసవంతమైన జీవనం సాగిస్తున్నారు. పౌర సంబంధాల ఏజంట్లు ఇలాంటివారిని, వారి సంపదను పొగడ్తలతో ముంచెత్తుతారు. పైగా దేశ అభివృద్ధిని సాధించినవాళ్లుగా ప్రచారం చేస్తుంటారు. ఆకలి, పౌష్టికాహారలోపం ఇంకా పెరుగుతూఉన్నాయి. ఇవి ఏ స్థాయిలో మనపై కొనసాగుతున్నదీ అర్థం చేసుకోవాలి. వెబ్ ప్రపంచం ఏనాడూ అందరినీ ఒకేస్థాయిలో నిలిపేందుకు పనిచేయడంలేదు. ఇది మన ఆలోచనలను నియంత్రిస్తోంది. పాలక సంపన్నులు, వారి ఆధిపత్యవ్యవస్థ పటిష్టమవుతున్నదికానీ, ఎటువంటి సైద్ధాంతిక భావజాలాన్ని అనుమతించడంలేదు.

సాయిబాబా సతీమణి వసంతకుమారి తన భర్తకు అండగా ఏమాత్రం వెరవకుండా అత్యంత ధైర్యంగా నిలిచి పోరాడారు. అంకితభావం కలిగిన ఇలాంటివారు ఎంతో ఆశతో జీవనం సాగిస్తారు. సాయిబాబా ఇప్పుడు ఏ ప్రభుత్వ హింసలేకుండా స్వేచ్ఛగా ఉన్నారు. అయనకు ఇప్పుడు ఏ సంకెళ్లు లేవు. మానవాళికి సేవ చేసేందుకు వీరుఎంతో స్ఫూర్తి నిస్తున్నారు. ఫాదర్ స్టాన్‌స్వామి, ప్రొఫెసర్ సాయిబాబా మరణం భారత రాజకీయ, న్యాయవ్యవస్థ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోంది. రాజకీయపార్టీలు ఇలాంటి వాటిని గూర్చి చాలా అరుదుగా మాట్లాడతాయి. వృద్ధులకు లేదా వైకల్యం గలిగిన వ్యక్తికి, హక్కును నిలిపేందుకు సహాయం చేసేవారు, సంప్రదింపులు జరిపేవారు ఎవరు? కోర్టులో ప్రతివ్యక్తి తననుతాను రక్షించుకునేందుకు హక్కు ఉన్నది. రాజ్యం అందరినీ ఒకే విధంగా చూడాలి.అలాగే ప్రజలు తమనుతాము రక్షించుకునేందుకు అవకాశాన్ని కల్పించాలి. రాజ్యవ్యవస్థ క్రౌర్యానికి ప్రొఫెసర్ సాయిబాబా, ఫాదర్‌స్టాన్ స్వామిలాంటివారు బలయ్యారు.

మోదీని కలిసిన ఆతిశీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆతిశీ మొదటిసారి ప్రధాని మోదీతో సోమవారం భేటీ అయ్యారు. ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య సంపూర్ణ సహకారాన్ని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్‌లో ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. ఇద్దరి మధ్య జరిగిన చర్చ గురించి వివరాలు వెల్లడించలేదు. ప్రధాని మోదీతో భేటీ విషయాన్ని ఆతిశీ కూడా ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశ రాజధాని పురోగతి, సంక్షేమం కోసం ఢిల్లీ-కేంద్ర ప్రభుత్వాల మధ్య పూర్తిస్థాయి సహకారాన్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చినప్పటికీ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి మధ్య అధికార పోరు సాగుతుండటం తెలిసిందే.

హిట్ లిస్ట్‌లో సిద్దిఖీ కుమారుడు

ముంబై: ఎన్సీపీ కీలక నేత, బాలీవుడ్ మిత్రుడు, మాజీమంత్రి బాబా సిద్దిఖీ హత్యతో ముంబై నగరం ఉలిక్కిపడింది. ఈ కేసు విచారిస్తోన్న పోలీసులకు మరో కీలక విషయం తెలిసింది. సిద్దిఖీ కుమారుడు, ఎమ్మెల్యే జీషన్ సిద్దిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు భావిస్తోంది. తండ్రీ కుమారులను చంపేందుకు కాంట్రాక్టు ఇచ్చినట్లు షూటర్లు విచారణలో పేర్కొన్నట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. హత్య జరిగిన ప్రాంతంలోనే సిద్దిఖీ, ఆయన కుమారుడు ఉంటారని తమకు ఆదేశాలు ఇచ్చిన వ్యక్తులు చెప్పారని షూటర్లు వెల్లడించారు. ఇద్దరిపైనా దాడి చేసే వీలులేకపోతే... ఎవరు దొరికితే వారిని హత్య చేయాలని చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడించారు. జీషన్ సిద్దిఖీ కాంగ్రెస్ టికెట్‌పై వంద్రే ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. శాసనమండలి ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డాడన్న ఆరోపణలతో పార్టీ ఆయనను బహిష్కరించింది. ముగ్గురు దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్దిఖీ ప్రాణాలు కోల్పోయారు. దుండగులు ఆయనపై కాల్పులు జరుపుతున్న సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. ఇది ఒక కిరాయి హత్యని, వ్యాపార లావాదేవీల్లో గానీ, మురికివాడ అభివృద్ధి ప్రాజెక్టులో విభేదాలవల్లగానీ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సిద్దిఖీని తామే చంపామని లారెన్స్ బిష్ణోయ్ ముఠా ప్రకటించింది.

పాక్ ప్రధాని విందుకు జైశంకర్

న్యూఢిల్లీ: భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్థాన్ పర్యటనకు సిద్ధమయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంఘం వార్షిక సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. పాక్ ప్రధాని ఇచ్చే విందులో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు తెలిసింది. రెండుదేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న తరుణంలో విదేశాంగ మంత్రి పాక్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్సీవో సదస్సులో పాల్గొనేందుకు జైశంకర్ మంగళవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారు. అనంతరం సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇచ్చే విందులో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా ఆయన పాకిస్థాన్‌లో 24గంటల కంటే తక్కువ సమయమే ఉండనున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సమావేశానికి చైనా, రష్యా ప్రధానులు కూడా హాజరుకానున్నారు. ఇందుకోసం చైనా ప్రధాని ఇప్పటికే ఇస్లామాబాద్ చేరుకున్నారు. సభ్యదేశాల నుంచి ముఖ్యులు రానున్న నేపథ్యంలో ఇస్లామాబాద్ మొత్తం భద్రతావలయంలో ఉంది.

బాంబు బెదిరింపుతో ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్

ముంబై: ఎయిరిండియా విమానం గాల్లో ఉండగా అత్యవసర పరిస్థితి తలెత్తింది. ముంబై నుంచి న్యూయార్క్ బయల్దేరిన విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అత్యవసరంగా దారి మళ్లించి... ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దించారు. ఆ సమయంలో విమానంలో 239 మంది ప్రయాణికులు ఉన్నారు. సిబ్బంది, ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. 'ముంబై నుంచి బయల్దేరిన ఎయిరిండియా విమానానికి భద్రతాపరమైన హెచ్చరిక వచ్చింది. దాంతో వెంటనే ఢిల్లీకి దారి మళ్లించాం. ప్రయాణికులందరినీ దింపేశాం. వారంతా సురక్షితంగా ఉన్నారు. ఆ విమానాన్ని నిర్మానుష్యంగా ఉండే రన్‌వేపైకి తరలించాం. భద్రతాపరమైన తనిఖీలు చేశాం' అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. ఇదిలాఉంటే.. ముంబై నుంచి జెడ్డా, ముంబై నుంచి మస్కట్ మధ్య నడుస్తోన్న రెండు ఇండిగో విమానాలకు కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. మూడు రోజుల క్రితం ఎయిరిండియా విమానానికి ఈతరహాలో ఎమర్జెన్సీ పరిస్థితి ఎదురైంది. హైడ్రాలిక్ వ్యవస్థ పనిచేయడం లేదని గుర్తించిన పైలట్లు... తిరుచ్చి విమానాశ్రయాన్ని అప్రమత్తం చేశారు. తమిళనాడులోని తిరుచ్చి నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే ఈ ఘటన చోటుచేసు కుంది. దీంతో తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ఉత్కంఠ పరిస్థితుల మధ్య సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

700 మంది షూటర్లు... 11 రాష్ట్రాల్లో నెట్‌వర్క్

- దావూద్ ఇబ్రహీంను తలపిస్తున్న బిష్ణోయ్ ముఠా
- రోజురోజుకూ విస్తరిస్తున్న నేర సామ్రాజ్యం

ముంబై: ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) నేత, మాజీ మంత్రి బాబా సిద్దిఖీపై బహిరంగంగా కాల్పులు జరిపి హత్యగావించిన ఘటన కలకలం రేపింది. ఈ హత్య వెనుక లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుల పేర్లు మరోసారి వెలుగులోకి వచ్చాయి. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు ఎవరు సహాయం చేసినా అవే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిందితులు ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా తెలియజేసే ప్రయత్నం చేశారు. తొలుత సిద్ధూ మూసేవాలా ఇప్పుడు బాబా సిద్దిఖీ హత్యలతో లారెన్స్ బిష్ణోయ్ ముఠా ఇప్పుడు నేర ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోంది. రెండు దశాబ్దాల క్రితం అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం చేసినట్లే లారెన్స్ బిష్ణోయ్ ముఠా సాగిస్తున్న బీభత్సం విస్తరిస్తోంది. గతంలో దావూద్ పేరు వింటేనే ప్రజలు వణికిపోయేవారు. లారెన్స్ బిష్ణోయ్ పని విధానం కొద్దిగా భిన్నంగా ఉన్నప్పటికీ, అది అదే దిశలో సాగుతోంది.

700 మందికి పైగా షూటర్లు...

లారెన్స్ బిష్ణోయ్ ముఠాను కెనడా పోలీసులు, భారతీయ ఏజెన్సీల దృష్టిలో వాంటెడ్ క్రిమినల్ అయిన సత్వీందర్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ నడుపుతున్నాడు. బిష్ణోయ్ గ్యాంగ్‌లో 700 మందికి పైగా షూటర్లు ఉన్నారని, వారిలో 300 మంది పంజాబ్‌తో సంబంధం ఉన్నారని ఎన్ఐఏ ఛార్జ్ షీట్ వెల్లడించింది. బిష్ణోయ్, గోల్డీ బ్రార్ చిత్రాలు ఫెస్‌బుక్ , ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయబడ్డాయి. కోర్టుకు వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు బిష్ణోయ్ ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయడం వల్ల యువతలో ముఠాలో చేరాలనే ఆకాంక్ష పెరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. 2020-21 నాటికి బిష్ణోయ్ ముఠా దోపిడీ ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించి ఆ డబ్బును హవాలా మార్గాల ద్వారా విదేశాలకు పంపించారు. ఎన్ఐఏ నివేదిక ప్రకారం.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఒకప్పుడు పంజాబ్‌కు మాత్రమే పరిమితం. అయితే లారెన్స్ బిష్ణోయ్ తన సన్నిహిత సహచరుడు గోల్డీ బ్రార్ సహాయంతో హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్‌లోని ముఠాలతో కూటమిగా ఏర్పడి భారీ నెట్‌వర్క్‌ను సృష్టించాడు. ఇప్పుడు లారెన్స్ బిష్ణోయ్ ముఠా... పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, జార్ఖండ్‌లతో సహా ఉత్తర భారతదేశంలో విస్తరించింది. యువతను నేర ముఠాల్లోకి చేర్చుకోవడానికి సోషల్ మీడియాతోపాటు అనేక ఇతర మార్గాలను ఉపయోగిస్తున్నారు. ముఠాలు యువతను కెనడాకు లేదా వారికి నచ్చిన దేశానికి తీసుకువెళతామని హామీ ఇస్తూ వారిని ఆకర్షిస్తాయి. ఎన్ఐఏ ప్రకారం.. పాకిస్థాన్‌కు చెందిన ఖలిస్తానీ ఉగ్రవాది హర్విందర్ సింగ్ రిండా పంజాబ్‌లో లక్ష్య హత్యలు, నేర కార్యకలాపాలు నిర్వహించడానికి బిష్ణోయ్ షూటర్‌లను ఉపయోగిస్తాడు.

16 మంది ముఠా నాయకులపై 'ఉపా'

లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌లతో సహా నేర ముఠాలకు నాయకత్వం వహిస్తున్న 16మందిపై యూఏపీఏ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలైంది. ఎన్ఐఏ తన ఛార్జిషీట్‌లో లారెన్స్ బిష్ణోయ్ ముఠాను దావూద్ ఇబ్రహీం డీ-కంపెనీతో పోల్చింది. దావూద్ ఇబ్రహీం 90వ దశకంలో చిన్న చిన్న నేరాల నుంచి తన నెట్‌వర్క్‌ను ఏర్పరచుకున్న విధంగానే లారెన్స్ బిష్ణోయ్ ఉగ్రవాద సిండికేట్ పనిచేస్తున్నట్లు ఎన్ఐఏ ఛార్జ్ షీట్ వెల్లడించింది. దావూద్ ఇబ్రహీం మాదకద్రవ్యాల అక్రమ రవాణా, లక్షిత హత్యలు, దోపిడీ రాకెట్ల ద్వారా తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. తరువాత డీ-కంపెనీని ఏర్పాటు చేయడానికి పాకిస్థాన్ ఉగ్రవాదులతో కలిసి పనిచేశాడు. అదే విధంగా చిన్న చిన్న నేరాలతో మొదలైన బిష్ణోయ్ ముఠా... ఇప్పుడు ఉత్తర భారతాన్ని శాసిస్తున్నది.

అండర్ వరల్డ్ మాఫియా విజృంభణ

షిండే సర్కారుపై సంజయ్ రౌత్ విమర్శ

ముంబై: ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్దిఖీ హత్య నేపథ్యంలో శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహాయుతి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో గ్యాంగ్ వార్‌లు, అండర్ వరల్డ్ డాన్‌ల ప్రభావం పెరుగుతోందని దుయ్యబట్టారు. ఈ కుట్రలు గుజరాత్‌లో జరుగుతున్నా యని అన్నారు. ఇటీవల గుజరాత్‌లో రూ.5,000 కోట్ల విలువైన డ్రగ్స్ లభ్యమైన విషయం గురించి ప్రస్తావిస్తూ అంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డా యంటే ఇంకా దేశంలో ఏ స్థాయిలో డ్రగ్స్ పంపిణీ అయ్యుంటాయోనని అనుమానం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి గుజరాత్‌కు చెందిన అండర్ వరల్డ్ డాన్‌ల మద్దతు ఉందని సంజయ్ రౌత్ ఆరోపించారు. నిజంగా వారితో ఎటువంటి సంబంధాలు లేకపోతే సిద్దిఖీ హత్యకు కుట్ర పన్నిన వారికి శిక్ష విధించాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు సవాలు విసిరారు.



'బద్లాపూర్ లైంగిక వేధింపుల కేసులో చర్య తీసుకున్న తర్వాత షిండే తనను తాను సింహమని ప్రకటించుకున్నారు. అదే నిజమైతే, ఆయనకు ధైర్యముంటే సిద్దిఖీ హత్యకు కుట్రపన్నిన వారిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి' అని రౌత్ అన్నారు. బాబా సిద్దిఖీ శనివారం రాత్రి తన కుమారుడి కార్యాలయం ముందు టపాసులు కాలుస్తున్న సమయంలో హర్యానాకు చెందిన గుర్మయిల్ బల్జిత్ సింగ్, యూపీకి చెందిన ధర్మరాజ్‌రాజేశ్, కశ్యప్ అనే యువకులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో కన్నుమూశారు.

ఎన్నికల వేళ షిండే ప్రభుత్వం గిమ్మిక్కులు

ముంబై: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహారాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక నిర్ణయాలు తీసుకుంటుంది. అందులో భాగంగా ముంబై నగరంలోకి ప్రవేశించే టోల్ ప్లాజాల వద్ద లైట్ మోటార్ వాహనాలకు ఇకపై టోల్ ఫీజు వసూలు చేయబోమని ప్రకటించింది. కార్లు, ఎస్‌యూవీలకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఇది అమల్లోకి రానుంది. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. సోమవారం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. థానే నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న షిండే... గతంలో చాలాసార్లు టోల్ వసూళ్లకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. ఇప్పుడు వాటిని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి ఇదే చివరి మంత్రివర్గ సమావేశం. మహారాష్ట్ర స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ పేరు మార్చుతూ మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఇటీవల కన్నుమూసిన రతన్ టాటా గౌరవార్థం ఈ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టారు. 'రతన్ టాటా స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ'గా దీనిని మార్చారు.

షిండే సర్కారు నిర్ణయంతో వాహనదారులకు ఐదు టోల్‌ప్లాజాల వద్ద టోల్ రుసుముల నుంచి విముక్తి లభించనుంది. దహిసర్, ములుంద్, వాషి, ఐరోలి, తిన్హంత్ నాకాల్లో కార్లు, ఎస్‌యూవీలు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ ప్రస్తుతం టోల్ ఫీజుగా రూ.45 వసూలు చేస్తున్నారు.

ముంబై నగరంలోకి చిన్న వాహనాలతో ప్రవేశించే రోజువారీ ప్రయాణికులకు ఇది ఊరట కలిగించే నిర్ణయమని భావిస్తున్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే: విపక్షాలు

మరోవైపు షిండే ప్రభుత్వం టోల్ రుసుములు తొలగిస్తూ తీసుకున్న నిర్ణయంపై విపక్షాలు మండి పడ్డాయి. ఎన్నికలకు ముందు ఇది రాజకీయ గిమ్మిక్కు అంటూ విమర్శించాయి. మహారాష్ట్రలో ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ హత్య ఘటన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది ఆరోపించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను 'కేంద్ర ఎన్నికల సంఘం' ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. నవంబర్ రెండు లేదా మూడో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీటితో పాటు వివిధ రాష్ట్రాల్లోని 45 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు సైతం జరపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామా చేసిన కేరళలోని వయనాడ్ నియోజకవర్గం కూడా ఉంది.

శశిథరూర్‌కు సుప్రీంలో స్వల్ప ఊరట

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని శివలింగంపై 'తేలు'తో పోలుస్తూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. కేసు ప్రొసీడింగ్స్‌పై తాత్కాలిక స్టేను అత్యున్నత న్యాయస్థానం పొడిగించింది. నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఢిల్లీ పోలీసులు, ఫిర్యాదుదారుడికి న్యాయమూర్తులు హృషికేష్ రాయ్, ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పరువునష్టం కేసు విచారణపై ఉన్న తాత్కాలిక స్టే పొడిగిస్తున్నట్టు చెప్పింది. శశిథరూర్‌కు వ్యతిరేకంగా క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై గత సెప్టెంబర్ 10న సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే ఇచ్చింది. తనపై వేసిన పరువునష్టం కేసు కొట్టివేయాలంటూ శశిథరూర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆగస్టు 29న హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ డిఫమేషన్ ఫిర్యాదులో తనను నిదింతుడిగా పేర్కొంటూ 2019 ఏప్రిల్ 27న విచారణ కోర్టు సమన్లు కొట్టివేయాలని థరూర్ కోరారు. శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు తన మతపరమైన మనోభావాలను దెబ్బతీశాయంటూ బీజేపీ నేత బబ్బర్ విచారణ కోర్టులో ఫిర్యాదు చేశారు. కాగా, తాజాగా నాలుగు వారాల్లోగా తన స్పందన తెలియజేయాలంటూ ఫిర్యాదుదారు బబ్బర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది.

హంతకులకు సత్కారాలా?

హిందూ సంస్థలపై కాంగ్రెస్ మండిపాటు

తిరువనంతపురం: జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితులను హిందూత్వ గ్రూపులు సత్కరించడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) సోమవారం ఉదయం 'ఎక్స్'లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఇందులో కర్నాటకలోని విజయపురాలో లంకేశ్‌పై కాల్పులు జరిపినట్లు చెప్పబడుతున్న నిందితులు పరశురాం వాఘ్మోర్ (33), మనోహర్ ఎదవే (40)కి కొంతమంది పూలమాలలు వేయడం కనిపించింది. 'గౌరీ లంకేశ్ హంతకులు, ఒక మహిళను కాల్చి చంపిన పిరికిపందలు. వారికి కుంకుమరంగు బట్టలతో దండలు వేశారు. కుంకుమ ధైర్యం, త్యాగాన్ని సూచిస్తుంది. నేరం, పిరికితనాన్ని కాదు. మితవాదం హిందూమతాన్ని ముక్కలు ముక్కలుగా నాశనం చేస్తోంది' అని కేపీసీసీ 'ఎక్స్'పై రాసుకొచ్చింది. మితవాద రాజకీయాలను తీవ్రంగా విమర్శించే గౌరీ లంకేశ్... సెప్టెంబరు 5, 2017న బెంగుళూరులోని రాజరాజేశ్వరి నగర్‌లో గల తన నివాస ప్రాంగణంలో హత్యకు గురయ్యారు. ముఖం కనిపించకుండా హెల్మెట్ ధరించిన నిందితుడు... మోటర్‌బైక్‌పై నుంచి దిగి గౌరీ లంకేశ్‌పై నాలుగుసార్లు కాల్పులు జరిపాడు. ఈ కేసులో కర్నాటకలో ప్రసిద్ధి చెందిన శ్రీరాం సేన కార్యకర్త వాఘ్మోర్ 2018 జూన్‌లో అరెస్టయ్యాడు. ఈ కేసులో నిందితులైన వాఘ్మోర్, మనోహర్ యాదవ్ జైలులో ఆరేళ్లు గడిపారు. వారికి బెంగళూరు సెషన్స్ కోర్టు ఈ నెల 9న బెయిల్ మంజూరు చేయడంతో పరప్పన అగ్రహార జైలు నుంచి ఈ నెల 11న విడుదలయ్యారు. అనంతరం సొంత ఊరైన విజయపురకు చేరుకున్న వారికి స్థానిక హిందూ అనుకూల సంస్థలు పూల దండలు చేసి, కాషాయ శాలువాలు కప్పి, వేద మంత్రాలతో ఘన స్వాగతం పలికాయి. వారిని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్దకు, అనంతరం కాళికా ఆలయానికి తీసుకువెళ్లి పూజలు జరిపాయి. కాగా, ఈ కేసులో వీరితో పాటు మరో ఆరుగురికి కూడా బెయిల్ మంజూరైంది. 'ఈరోజు విజయదశమి. మాకు ముఖ్యమైన రోజు. గౌరీ లంకేశ్ హత్యకు సంబంధించిన ఆరోపణలపై ఆరేళ్లపాటు అన్యాయంగా జైలుకెళ్లిన పరశురాం వాఘ్మోర్, మనోహర్ యాదవ్‌లను మేము స్వాగతించాము. అసలు దోషులు ఇంకా కనుగొనబడలేదు. కానీ ఈ వ్యక్తులు వారు హిందూ అనుకూల కార్యకర్తలు కాబట్టి వారి కుటుంబాలు బాధపడ్డాయి. ఈ అన్యాయాన్ని తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి' అని హిందూ అనుకూల నేత ఒకరు ఇండియా టుడేతో అన్నారు. కాగా ఆగస్టు 17, 2022న, బిల్కిస్ బానో అత్యాచారం కేసులో నిందితులుగా ఉన్న 11 మందిని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసిన తర్వాత విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు వారికి పూలమాల వేసి ఘనంగా ఆహ్వానించారు.

రేపు నాసిక్‌లో ప్రగతిశీల పార్టీల సమావేశం

మహారాష్ట్ర ఎన్నికల వ్యూహాలపై చర్చే అజెండా: అశోక్ ధావలే

థానె: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చేనెలలో జరగనున్న దృష్ట్యా అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ప్రగతిశీల పార్టీలు బుధవారం నాసిక్‌లో సమావేశం కానున్నాయి. ఈ మేరకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు డాక్టర్ అశోక్ ధావలే సోమవారం వెల్లడించారు. సీపీఐ, సీపీఎం, పీజెంట్స్, వర్కర్స్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, సత్యసోదక్ కమ్యూనిటీ పార్టీ ప్రతినిధులు ఈ రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరవుతారని తెలిపారు. ముంబైలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశం ఈ మేరకు నిర్ణయించినట్లు అశోక్ ధావలే వెల్లడించారు. రాష్ట్రంలో బీజేపీపై వ్యతిరేత ఉన్న వారిని ఏక తాటిపైకి తెచ్చి వారి మద్దతు పొందడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. మహా వికాస్ అగాదీ- ఇండియా ఐక్య సంఘటన కింద ప్రగతిశీల వర్గాలకు సీట్ల సర్దుబాటు, ప్రజా విధానాల రూపకల్పన వంటివి చర్చిస్తామని అశోక్ తెలిపారు.

ఉద్ధవ్ ఠాక్రేకు స్వల్ప అస్వస్థత

ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే సోమవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ముంబైలోని రిలయెన్స్ ఆసుపత్రిలో చేర్చారు. ఆయనకు యాంజియోప్లాస్టీ నిర్వహించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆయనకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. గతంలోనూ గుండె సంబంధిత సమస్యలు తలెత్తడంతో 2012లో ఆయనకు యాంజియోప్లాస్టీ నిర్వహించారు. ఆ తర్వాత నుంచి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఉద్ధవ్ ఠాక్రే రొటీన్ ఆరోగ్య పరీక్షల కోసం ఆసుపత్రిలో చేరారని, మంగళవారం ఉదయం లేదా సాయంత్రం డిశ్చార్జి కావచ్చని ఆసుపత్రి వర్గాలు చెప్పాయి. మరోవైపు, ముందస్తుగా అనుకున్నట్టుగానే ఆరోగ్య పరీక్షల కోసం ఉద్ధవ్ ఠాక్రే ఆసుపత్రిలో చేరారని, అందరి ఆశీస్సులతో అంతా సవ్యంగానే ఉందని, ప్రజాసేవ చేసేందుకు పూర్తి సన్నద్ధతో ఆయన ఉన్నారని ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే ట్వీట్‌లో తెలిపారు.

బెంగాల్ రాజ్‌భవన్‌కు యువ వైద్యుల మార్చ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనలో విచారణ వేగవంతంగా, పారదర్శకంగా జరగాలని డిమాండ్ చేస్తూ యువ వైద్యులు సోమవారం రాజ్‌భవన్‌కు కదం తొక్కారు. రాజధాని నగరంలో ధర్మతల సమీపంలోని డోరినా క్రాసింగ్ నుంచి రాజ్‌భవన్ వరకు మార్చ్ సాగింది. అన్ని వర్గాల వారు ప్రదర్శనలో పాల్గొన్నారు. 'ఈ నేరం వెనుక ఉన్నది ఒక్కడే అన్న సీబీఐ చార్జిషీటును తిరస్కరిస్తున్నాం. ఆర్జీ కర్ ఆసుపత్రిలో పనిచేసిన మా సోదరికి న్యాయం జరగాలని కోరుకుంటున్నాం. ఆమెపై అత్యాచారం, హత్య కేసులో విచారణ మరింత వేగవంతం కావాలని, పారదర్శకంగా జరగాలని డిమాండ్ చేస్తున్నాం. 'గవర్నర్‌ను కలిసేందుకో లేక ఈ వ్యవహారంలో ఆయన జోక్యాన్ని కోరేందుకో రాజ్‌భవన్‌కు వెళ్లలేదు. ఆయనకు మా సందేశమివ్వడమే లక్ష్యంగా ఈ మార్చ్ చేపట్టాం. అయితే గవర్నర్ కార్యాలయానికి మెమోరాండాన్ని సమర్పించాం' అని జూనియర్ వైద్యుడు దేబశీష్ హల్దర్ వెల్లడించారు.

ఫైమా పెన్‌డౌన్ నిలిపివేత

కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న వైద్యుల ఆందోళనకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా నిరసన చేపడుతున్న ద ఫెడరేషన్ ఆఫ్ ఆల్‌ఇండియా మెడికల్ అసోసియేషన్(ఫైమా) పెన్‌డౌన్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. బెంగాల్ ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో పెన్‌డౌన్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేస్తామని ఫైమా తొలుత ప్రకటించింది. ఈ విషయంపై బెంగాల్ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడంతో పశ్చిమబెంగాల్ జూనియర్ దాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని వెల్లడించింది. అక్కడ సామరస్యపూర్వక పరిష్కారం లభించకపోతే అక్టోబర్ 15 నుంచి సమ్మెను తిరిగి కొనసాగిస్తామని తెలిపింది. అయితే రోగులకు అత్యవసర సేవలు అందజేస్తామని స్పష్టం చేసింది. 'ప్రభుత్వంతో జూనియర్ దాక్టర్ల చర్చలు ఫలించకపోవడంతో... జాతీయస్థాయిలో ఐక్యంగా పోరాడాలని మేము ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాం. బెంగాల్ ముఖ్యమంత్రికి గతంలో అల్టిమేటం ఇచ్చాం. అయినప్పటికీ సంతృప్తికరమైన చర్య కనిపించలేదు. అందువల్లే పెన్‌డౌన్‌కు పిలుపునిచ్చాం. ఇప్పుడు చర్చల్లో పాల్గొన్న అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం' అని ఫైమా పేర్కొంది.

క్షీణిస్తున్న వైద్యుల ఆరోగ్యం

హత్యాచార ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన జూనియర్ వైద్యులలో కొంతమంది ఆరోగ్యం క్షీణిస్తున్నట్లుగా వైద్యులు పేర్కొన్నారు. ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి చెందిన పులస్త ఆచార్య అనే వైద్యుడు తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండటంతో ఆదివారం రాత్రి అతడిని ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో అత్యవసర చికిత్స అందిస్తున్నామన్నారు. సిలిగురి నగరంలో నిరాహార దీక్ష చేస్తున్న మరో ముగ్గురు జూనియర్ వైద్యుల ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో ఆసుపత్రికి తరలించామన్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించేవరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని వారు పునరుద్ఘాటించారు. ఈ దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఎవరికి ఏం జరిగినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నిజాయతీ... ముక్కుసూటితనం

రతన్ టాటాపై చంద్రశేఖరన్ భావోద్వేగ పోస్టు

ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మరణం ప్రతిఒక్కరినీ బాధించింది. ఆయనకున్న సేవాగుణం, శునకాలపై ప్రేమ, వ్యాపార దక్షత గురించి చాలామంది ప్రముఖులు ఎన్నో విషయాలు వెల్లడించారు. తాజాగా టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ లింక్డిన్‌లో భావోద్వేగ పోస్టు పెట్టారు. 'మొదట వ్యాపార అంశాలపై మొదలైన మా పరిచయం కాలక్రమంలో వ్యక్తిగత అనుబంధంగా మారింది. కార్లు, హోటళ్లతో మొదలయ్యే మా చర్చ ఇతర విషయాల వైపు వెళ్లేది. మాట్లాడేటప్పుడు ప్రతి విషయాన్ని ఎంతగా గమనించేవారో మనకు అర్థమవుతుంది' అని రాసుకొచ్చారు. చాలా అనుభవాల గురించి వెల్లడించారు. 2017లో టాటా మోటార్స్ సంస్థకు ఉద్యోగుల యూనియన్‌కు మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న వేతన సంబంధిత వివాదంపై జరిగిన చర్చలో టాటాతో పాటు తాను కూడా పాల్గొన్నానని తెలిపారు. 'ఈ సమస్య పరిష్కారంలో నెలకొన్న జాప్యంపై విచారం వ్యక్తం చేసిన ఆయన... కంపెనీ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ముక్కుసూటిగా, నిజాయతీగా వారితో చర్చించారు. తక్షణ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సును కాంక్షిస్తూ ఆ దిశగా దృష్టిసారించారు. గ్రూప్‌లోని ఇతర సంస్థల్లోని అందరు ఉద్యోగుల విషయంలో ఆయన ఆలోచన ఈ విధంగానే ఉండేది' అని తెలిపారు. బాంబే హౌస్ పునరుద్ధరణ అంశం తనకు టాటాకు మధ్య జరిగిన చర్చ గురించి మాట్లాడుతూ.. 'టాటా సంస్థ కేంద్ర కార్యాలయం 'బాంబే హౌస్'ను 1924లో నిర్మించారు. అత్యంత పవిత్ర స్థలంగా భావించే దానికి కొన్ని దశాబ్దాల పాటు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఒకసారి ఆ విషయమై టాటాతో మాట్లాడాను. అప్పుడు ఆయన వెంటనే శునకాల ప్రస్తావన తెచ్చారు. 'మీరు రిన్నోవేషన్ అంటున్నారు అంటే ఖాళీ చేయాలనేగా మీ అర్థం' అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరిని దగ్గరలోని కార్యాలయానికి తరలిస్తామని సమాధానమిచ్చాను. శునకాలు ఎక్కడికి వెళ్తాయని వెంటనే ఆయన నుంచి మరో ప్రశ్న వచ్చింది. వాటి కోసం ఒక కెన్నెల్ ఏర్పాటు చేస్తామని చెప్పగానే ఆయన ముఖంపై చిరునవ్వు కనిపించింది. ఆ పునరుద్ధరణ పనులు పూర్తికాగానే... మొదట కెన్నెల్‌ను చూస్తానని టాటా అన్నారు. ఆ సంతోషం చూసిన తర్వాత మేం సరైన పని చేశామనిపించింది' అని అన్నారు. టాటా ఏదైనా ప్రాంతానికి వెళ్తే... ఏళ్లు గడిచినా అక్కడున్న ప్రతిదాన్ని ఉన్నది ఉన్నట్టుగా గుర్తుపెట్టుకునేవారంటూ ఆయన జ్ఞాపకశక్తి పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఆయన గురించి చెప్పాలంటే ఎన్నో విషయాలున్నాయని, ఆయన లేరన్న విషయాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

సాయిబాబాది సర్కారు హత్య

- పదేళ్ల అన్యాయంగా జైల్లో బంధించిన దోషులకు శిక్ష పడాల్సిందే
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- పౌరహక్కుల ఉద్యమనేతకు జరిగిన అన్యాయంపై సీజేఐకి లేఖ
- సుప్రీంలో కేసు వేస్తామని ప్రకటన
- 'ఉపా' చట్టాన్ని సమీక్షించాలి: సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-హైదరాబాద్: పౌర హక్కుల ఉద్యమ నేత, దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మరణించలేదని, ఆయనను సర్కారే హత్య చేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి అని తేల్చిన న్యాయస్థానం... మరి సాయిబాబా అకారణంగా పదేళ్ల పాటు జైలులో మగ్గేలా చేసిన దోషులు ఎవరో కూడా తేల్చాలని ఆయన కోరారు. ఈ మేరకు సాయిబాబాకు జరిగిన అన్యాయంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి సీపీఐ తరఫున లేఖ రాశారు. అలాగే దీనిపై సుప్రీంకోర్టులో కేసు కూడా దాఖలు చేయనున్నట్లు నారాయణ వెల్లడించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి నారాయణ మాట్లాడారు. సాయిబాబాకు జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సీపీఐ తరఫున రాసిన లేఖను డాక్టర్ నారాయణ మీడియా సమావేశంలో విడుదల చేశారు. దాదాపు 90 శాతం అంగవైకల్యంతో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను పదేళ్ల పాటు అక్రమంగా నిర్బంధించి అతి క్రూరంగా హింసించిన కేంద్ర ప్రభుత్వంతో పాటు సాయిబాబాకు కనీసం బెయిల్ కూడా ఇవ్వకుండా పూర్తి పక్షపాత ధోరణితో వ్యవహరించిన న్యాయవ్యవస్థ రెండూ ముద్దాయిలేనని డాక్టర్ నారాయణ అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాకు జరిగిన అన్యాయంపై ప్రజాతంత్రవాదులు, మేధావులతో పాటు వివిధ వర్గాల ప్రజలను సమీకరించి పెద్దఎత్తున చర్చ లేవదీయనునట్లు నారాయణ తెలిపారు.

కమ్యూనిజాన్ని ఎవరూ అంతం చేయలేరు

2026 నాటికి అర్బన్ నక్సలైట్లను ఏరివేయాలని అన్ని రాష్ట్రాల సీఎంల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సూచించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నదని డాక్టర్ నారాయణ తెలిపారు. మనుషులను భౌతికంగా చంపగలరేమో కానీ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఎవరూ చంపలేరని, అది తెలియక పాలకులు మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిజాన్ని అంతం చేయడం నాటి హిట్లర్ వల్లే కాలేదన్నారు. సీఎంల సమావేశంలో మాత్రం ఇజ్రాయిల్ తరహాలో అత్యాధునిక సాంకేతిక పరిజానాన్ని వినియోగించుకుని నక్సలైట్లను గుర్తించి తుదముట్టించాలని సూచించినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అమిత్ షానే అనేక హత్య కేసులలో ముద్దాయిగా ఉన్నారని, అమిత్‌షా తనను తాను నిర్దోషి అని నిరూపించుకోవడానికి ఏకంగా 12 మందిని హత్య చేయించారని నారాయణ ఆరోపించారు. కేంద్రప్రభుత్వ పెద్దలు పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తూ దేశాన్ని చిన్నాభిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఉపా' చట్టాన్ని సమీక్షించాలి: రామకృష్ణ

కేంద్ర ప్రభుత్వం తనకు వ్యతిరేకంగా గళమెత్తిన వారిపై కక్షగట్టి... వారిపై 'ఉపా' చట్టాన్ని ప్రయోగించి ఇబ్బందులకు గురి చేస్తోందని, ఈ చట్టాన్ని సమీక్షించాల్సిన అవరముందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక సరఫరాపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించి ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఇసుక విధానం జగన్ హయాంలో కంటే కూడా ఘోరంగా ఉందన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన తర్వాత ఉచితంగానే ఇసుకను అందజేస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు... దానిని అమలు చేయడంలో తీవ్ర వైఫల్యం చెందారని, దీంతో గతంలో కంటే ఇసుక ధరలు విపరీతంగా పెరిగిపోవడమే కాకుండా అసలు ఇసుక దొరకడం లేదన్నారు. మంత్రులు, అధికార పార్టీ ఎంఎల్‌ఏలు ఇందుకు కారణమని ఆయన తెలిపారు.

మద్యం షాపుల కేటాయింపు పారదర్శకం

- 90వేల దరఖాస్తులు...రూ.1797 కోట్ల ఆదాయం
- 16 నుంచి పూర్తి స్థాయిలో ఇసుక
- ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూతన మద్యం విధానంలో భాగంగా అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాలను కేటాయించామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. విజయవాడ కానూరు ఏపీఎండీసీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరు సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో చేసిన దుర్మార్గాలకు, స్కాములకు తెరదించామన్నారు. 3396 మద్యం విక్రయ దుకాణాలకు ఈనెల 1వ తేదీ నుంచి ఆఫ్ లైన్, ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానించగా 89,882 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.1797కోట్ల ఆదాయం సమకూరిందని, రాజకీయ ఒత్తిళ్లకు అవకాశం లేకుండా దుకాణాలు కేటాయించామన్నారు. గతంలో ఒక్కో దుకాణానికి సగటున 18దరఖాస్తులు వస్తే...ఇప్పుడు ఏకంగా 26.7 దరఖాస్తులు వచ్చాయని, ఎన్టీఆర్ జిల్లాలో ఒక్కో దుకాణానికి వందకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 2015-17లో 4380 దుకాణాలకుగాను 65,208 దరఖాస్తులురాగా...రూ.225 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. 2017-19లో 4377 దుకాణాలకు 76,329 దరఖాస్తులురాగా రూ.422 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరిందని చెప్పారు. ఇప్పుడు ఏకంగా 89,882 దరఖాస్తులు, రూ.1797 కోట్ల ఆదాయం రావడం సంతోషకరమని, ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి ఈ దరఖాస్తుల సంఖ్యనే నిదర్శనమన్నారు. తప్పు చేస్తే ఏ ఒక్కరినీ వదిలేది లేదని, నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహించినా, మద్యం విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. గత పాలకులు ఎవరికీ వ్యాపారం చేసుకునే వీలు లేకుండా ఏకపక్షంగా దుకాణాలన్నింటినీ హస్తగతం చేసుకున్నారని, మద్యం తయారీ నుంచి అమ్మకం వరకు అన్ని వ్యవస్థల్నీ గుప్పిట్లో పెట్టుకుని మద్యం మాఫియాను నడిపించారన్నారు. ఇసుక గురించి మాజీ సీఎం జగన్ మాట్లాడుతుంటే...దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఐదేళ్ల పాలనా కాలంలో జగన్ చేసిన దుర్మార్గపు పనుల కారణంగానే నేడు ఇసుక కోసం అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. ఎన్జీటీ, సుప్రీంకోర్టుల్లో కేసులకు కారణం ఎవరో...జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. వర్షాకాలంలో ఇసుక తవ్వకాలకు ఇబ్బందులుంటాయని గుర్తించి స్టాక్ యార్డుల్లోని ఇసుకను ప్రజలకు అందించామని, ఆ మేరకు 35లక్షల టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉన్నట్లు మేం బయట పెట్టామని చెప్పారు. త్వరలో బోట్ మెన్ అసోసియేషన్ల ద్వారా కూడా ఇసుక తీసుకొస్తామని, గత ప్రభుత్వం టన్ను ఇసుక రూ.475కి విక్రయిస్తే... తాము సీనరేజీ, లోడింగ్ చార్జీలను నామమాత్రంగా వసూలు చేస్తూ ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఈ నెల 16 నుంచి 48 రీచులు అందుబాటులోకి రాబోతున్నాయని, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తామని వెల్లడించారు. టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఎక్కడైనా ఇసుక అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయొచ్చని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

22,23 తేదీల్లో అమరావతిలో డ్రోన్ జాతీయ సదస్సు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 22, 23 తేదీల్లో జరగనున్న అమరావతి డ్రోన్ సదస్సు-2024 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను ఈ జాతీయ సెమినార్ నిర్వహణ భాగస్వామిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సు నిర్వహణకు రూ.5.54 కోట్ల వ్యయం అవుతుందని వెల్లడించింది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఈ జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, అర్బన్ ప్లానింగ్, శాంతి భద్రతలు, వస్తు ఉత్పత్తి రంగాల్లో డ్రోన్ల వినియోగంపై ప్రధానంగా దృష్టి పెట్టనుంది. వాణిజ్యపరంగా డ్రోన్ల వినియోగం పెంచడమే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నారు. డ్రోన్ సిటీ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ మ్యాప్‌కు సదస్సులో రూపకల్పన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి పుల్నమ్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని డ్రోన్ తయారీ సంస్థలు, డ్రోన్ తయారీ నిపుణులు సదస్సులో పాల్గొంటారని అధికారులు తెలిపారు. సదస్సుకు వచ్చే వారు 'అమరావతి డ్రోన్ సమ్మిట్' వెబ్‌సైట్‌లో ఈనెల 15 వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఈనెల 22న దేశంలో ఎక్కడా జరగని విధంగా ఐదువేల డ్రోన్లతో విజయవాడలో డ్రోన్ షో నిర్వహించనున్నారు. భారీ డ్రోన్ షోను ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చు. అత్యాధునిక సేవలందించే డ్రోన్లు తయారు చేసిన వారికి ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

అప్పల ఊబిలో పేద దేశాలు

26 దేశాలపై 18ఏళ్లల్లోనే గరిష్ఠ రుణభారం: ప్రపంచ బ్యాంకు

వాషింగ్టన్: పేద దేశాలు అప్పుల ఊబిలో చిక్కుకుపోయినట్లు ప్రపంచ బ్యాంకు తెలిపింది. 18ఏళ్లలోనే లేనంత రుణ భారాన్ని అవి మోస్తున్నాయని పేర్కొంది. 2006 నుంచి 26 పేద దేశాలు అత్యధిక అప్పులను భరిస్తున్నట్లు తాజాగా నివేదిక విడుదల చేసింది. ప్రపంచ జనాభాలో 40శాతాన్ని కలిగివున్న ఈ దేశాల ప్రభుత్వాలకున్న అప్పు మొత్తం జీడీపీలో 72శాతంగా ఉందని తెలిపింది. ఇది 18ఏళ్లలోనే అత్యధికమని వెల్లడించింది. ఈ దేశాలకు అందే అంతర్జాతీయ సాయం కూడా రెండు దశాబ్దాలుగా క్షీణించినట్లు ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కొవిడ్ కాలంలో పేద దేశాలు భారీ రుణాలు పొందిన పర్యవసానంగా రుణభారం మూడొంతులు పెరిగిందని తెలిపింది. ఆర్థిక లోటును పూర్తిగా అధిగమించలేని పరిస్థితుల్లో పేద దేశాలు ఉన్నాయని, వీటిలో దాదాపు సగం దేశాలు దివాలా అంచున ఉన్నాయని పేర్కొంది. 2022 నుంచి బహుళ సంస్థల నుంచి ఈ దేశాలు పొందిన అభివృద్ధి నిధిలో దాదాపు సగం తమ అనుబంధ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఐడీఏ) సమకూర్చినట్లు వెల్లడించింది. పేద దేశాల నుంచి ప్రపంచం ముఖం చాటేసిన వేళ ఐడీఏ వాటికి జీవనరేఖగా ఉన్నదని బ్యాంకు ప్రధాన ఆర్థిక వేత్త ఇందర్‌మీత్ గిల్ అన్నారు. అత్యవసర పరిస్థితిని అధిగమించి, కీలక అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే పేద దేశాలు భారీ పెట్టుబడులను రాబట్టాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ ఆదాయంగల ఆర్థిక వ్యవస్థలు తమ కోసం తాము చేసుకొనగలిగినది పెద్దగా ఏమీ లేదు. వీటికి విదేశాల అండ ఎంతో అవసరమని బ్యాంకు డిప్యూటీ చీఫ్ ఎకనమిస్ట్ అయ్హన్ కోసె తెలిపారు.

యూపీలో పెచ్చరిల్లిన హింస

రెచ్చిపోయిన హిందూ సంస్థలు... ఆస్తుల ధ్వంసం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్‌లో దుర్గా విగ్రహ నిమజ్జన ఊరేగింపులో ఆదివారం రాత్రి రెండువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలో ఒక యువకుడు మృతి చెందడంతో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతుడి బంధువులతో పాటు వేలాది మంది నిరసనకారులు మృతదేహంతో మహిసి తహసిల్ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. కొంతమంది ఆందోళనకారులు ఒక ప్రైవేటు ఆసుపత్రి, ద్విచక్ర వాహనాల దుకాణం సహా ఆస్తులకు నిప్పుపెట్టారు. దీంతో పోలీసు బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు హోం ఏసీఎస్, శాంతి భద్రతల ఏడీజీ ఘటనా స్థలికి చేరుకున్నట్టు బహ్రాయిచ్ ఎస్పీ బృందా శుక్లా తెలిపారు. పూర్తి బలగాలను రంగంలోకి దింపి పరిస్థితిని అదుపులోకి తెచ్చామన్నారు. కాగా, మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సురేశ్వర్ సింగ్ నచ్చచెప్పి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని ఖననం చేసేందుకు వారు అంగీకరించారు.
హింసాకాండకు పాల్పడినట్టు చెబుతున్న 30 మందిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు.

కాగా, మన్సూర్ గ్రామంలోని మహరాజ్ గంజ్ బజార్‌లో దుర్గా నిమజ్జనం ఊరేగింపుతో కలిసి వస్తున్న రామ్ గోపాల్ మిశ్రా అనే వ్యక్తి అల్లర్ల మూకలు విసిరిన రాళ్లు, కాల్పుల్లో మరణించాడు. మిశ్రాతో పాటు సుమారు డజను మంది ఈ హింసాకాండలో గాయపడ్డారు. సమాచారం తెలియగానే హిందూ సంస్థలు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగాయి. దీంతో హర్ది పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్‌కే వర్మ, మహిసి ఔట్ పోస్ట్ ఇన్‌చార్జి శివకుమార్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి ఆయన గ్రామానికి సోమవారం ఉదయం చేర్చడంతో తిరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

యోగి హెచ్చరిక

దుర్గా నిమజ్జనం సందర్భంగా చెలరేగిన హింసను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లు రెచ్చగొట్టే వాళ్లను ఎంతమాత్రం సహించేది లేదని అన్నారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసు అధికారులను ఆదేశించారు. విగ్రహ నిమజ్జనాలు కొనసాగాల్సిందేనని, సకాలంలో విగ్రహాలు నిమజ్జనం చేయాల్సిందిగా మత సంస్థలకు సమాచారం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. బహ్రాయిచ్ హింసాకాండను ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఖండించారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యాలకు భంగం కలిగించే ఎలాంటి కుట్రలను సహించేది లేదన్నారు. అల్లరిమూకలకు రక్షణ కల్పిస్తూ వస్తున్న కొందరు తిరిగి చురుకుగా పనిచేస్తున్నారని, వారి పట్ల అత్యంత అప్రమత్తంగా, పూర్తి నిఘా వేసి ఉంచామని చెప్పారు.

పొన్నవోలుకు హైకోర్టులో షాక్

భద్రత కోరుతూ వేసిన పిటిషన్ కొట్టివేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనకు భద్రత కల్పించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సుదీర్ఘ వాదనల తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం... తాజాగా తీర్పు వెలువరించింది. సుధాకర్‌రెడ్డికి భద్రత కల్పించాల్సిన అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయస్థానం... పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'వక్ఫ్' భేటీ నుంచి విపక్ష ఎంపీల వాకౌట్

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై సోమవారం నిర్వహించిన పార్లమెంటరీ కమిటీ సమావేశాన్ని ప్రతిపక్ష ఎంపీలు బహిష్కరించారు. నియమాలు, నిబంధనలకు విరుద్ధంగా ప్యానల్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వాకౌట్ చేసిన ఎంపీల్లో గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్ (కాంగ్రెస్), ఎ.రాజా (డీఎంకే), అరవింద్ సావంత్ (శివసేన యూబీటీ), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), మొహిబుల్లా (ఎస్పీ), సంజయ్ సింగ్ (ఆప్) ఉన్నారు. బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలో జరిగిన సమావేశం తీరును విపక్ష ఎంపీలు ఖండించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి ప్రతిపక్ష పార్టీలోని సీనియర్లపై వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలకు తావు ఇవ్వడాన్ని ఆక్షేపించారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు విపక్ష సభ్యులంతా విడిగా సమావేశం నిర్వహించారు. లోక్‌సభ స్పీకర్‌ను ఆశ్రయించాలని కొందరు సూచించినట్లు తెలిసింది. ఇదిలావుంటే విపక్ష ఎంపీలు వాకౌట్ చేసినా పార్లమెంటరీ కమిటీ సమావేశం కొనసాగినట్లు సమాచారం.

కేరళలో కొత్త వ్యాధి కలకలం

తిరువనంతపురం: కేరళలో 'మురిన్ టైఫస్' అనే కొత్త వ్యాధి కలకలం రేపింది. సాధారణంగా రికెట్సియా టైఫి అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ఈ బ్యాక్టీరియా సోకిన దోమ కుట్టినపుడు మనుషులకు వ్యాధి వ్యాపిస్తుంది. ఎలుకలు, ముంగిసల ద్వారానిది వ్యాప్తి చెందుతుంది. ఇటీవల వియత్నాం, కంబోడియా దేశాలకు వెళ్లి వచ్చిన 75 ఏళ్ల వ్యక్తికి మురిన్ టైఫస్ సోకింది. జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్ర అలసటతో ఆయన ఆసుపత్రిలో చేరగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మురిన్ టైఫస్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. రోగి కాలేయం, మూత్రపిండాలకు ఇన్ఫెక్షన్ సోకిందని గుర్తించారు. వృద్ధుడి నమూనాలను నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ కోసం పంపడంతో వ్యాధి నిర్ధారణ అయిందని వైద్యులు తెలిపారు. తమిళనాడులోని వెల్లూరులో మరిన్ని పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మురిన్ టైఫస్‌ను ఫ్లీ బోర్న్ టైఫస్, ఫ్లీ బోర్న్ స్పాటెడ్ ఫీవర్ అని కూడా అంటారు. మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌లో ఇలాంటి వ్యాధులు కనిపించాయి. మురిన్ టైఫస్ సోకితే 7-14 రోజుల వరకు జ్వరం, తలనొప్పి, ఒళ్లు-కీళ్ల నొప్పులు, వికారం, వాంతులు, కడుపు నొప్పి, చర్మంపై దద్దుర్లు వంటివి వస్తాయి. వ్యాధి లక్షణాలు రెండు వారాల కంటే ఎక్కువగా ఉంటాయి. చికిత్స అందకపోతే అవి కొన్ని నెలల పాటు కొనసాగేందుకు వీలు ఉంటుంది.

దిల్లీలో బాణసంచాపై నిషేధం

జనవరి వరకు ఆంక్షలు - దీపావళికి మినహాయింపుల్లేవు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం పెద్ద సమస్యగా ఉంది. దీనిని అరికట్టేందుకు ఆప్ ప్రభుత్వం చేయగలిగినదంతా చేస్తోంది. ఇదే క్రమంలో బాణసంచాపై సంపూర్ణ నిషేధం విధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. 2025, జనవరి ఒకటో తేదీ వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని, దీపావళి పండుగకూ మినహాయింపు లేదని ఆదేశాల్లో పేర్కొంది. బాణసంచా పేలుళ్లు, తయారీ, నిల్వలు, విక్రయాల (స్థానిక దుకాణాలే కాదు ఆన్‌లైన్‌లో)ను అక్రమ కార్యకలాపాలుగా పరిగణిస్తామని స్పష్టంచేసింది. ఈ మేరకు దిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ కూడా ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ స్పందిస్తూ 'బాణసంచా పేలుళ్లతో వాయు నాణ్యత తీవ్రంగా ప్రభావితం అవుతుందన్నది అందరికీ తెలుసు. పీల్చేందుకు అనువైన గాలి దిల్లీలో ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆన్‌లైన్‌ల్లోనూ బాణసంచా విక్రయాలను నిషేధించాం అని అన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. బాణసంచా నిషేధం పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూసే బాధ్యతను దిల్లీ పోలీసులకు ప్రభుత్వం అప్పగించింది. దిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీకి పోలీసులు దీనిపై రోజువారీ నివేదికలను సమర్పించాలని సూచించింది. వాయు నాణ్యత మెరుగుదల దిశగా ఈ నిర్ణయానికి కీలక ముందడుగుగా దిల్లీలోని ఆప్ ప్రభుత్వం పేర్కొంది.

17 మందిని పట్టుకుని హత్య చేశారు

ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ లేఖ

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. దంతెవాడ-నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు అమరులయ్యారని, గోవాడి, బొండోస్, తుల్తులి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని, కార్పొరేట్ మైనింగ్ కంపెనీల కోసం పోలీసులు ఆపరేషన్ కగార్ నిర్వహించారని తెలిపింది. అక్టోబర్ 4వ తేదీ ఉదయం 11.30 నుంచి రాత్రి 9 గంటల వరకు 11 సార్లు భద్రతా బలగాలు కాల్పులు జరిపాయని, ఎదురు కాల్పుల్లో 14 మంది మావోయిస్టులు అమరులయ్యారని వివరించింది. కాల్పుల్లో గాయపడ్డ 17 మందిని మరుసటి రోజు ఉదయం (అక్టోబర్ 5న) పట్టుకుని హత్య చేసినట్లు పేర్కొంది. తూర్పు బస్తర్ డివిజన్ కమిటీని అంతం చేయడానికి ఫాసిస్ట్ పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించింది. అమరవీరుల ఆశయాలను స్మరించుకుంటూ విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకువెళతామని స్పష్టం చేసింది. తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరుతో మావోయిస్ట్ పార్టీ లేఖ విడుదల చేసింది.

ట్రూడో సర్కార్‌పై విశ్వాసం లేదు

భారత్ దౌత్యవేత్తలు వెనక్కి

న్యూదిల్లీ/ఒట్టావా: భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు మరింత దిగజారాయి. ఇందుకు సంబంధించి సోమవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యకేసులో ఇటీవల భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ సహా కొంతమంది దౌత్యవేత్తలను 'పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్'లుగా (అనుమానితులుగా) కెనడా పేర్కొనడాన్ని భారత్ తీవ్రంగా ఖండించి భారత్... కెనడాలోని తన హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలు, అధికారులను వెనక్కి రప్పించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. తమ దౌత్యవేత్తలకు భద్రత కల్పించే విషయంలో ట్రూడో సర్కారుపై తమకు విశ్వాసం లేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై అంతకుముందు భారత్‌లోని కెనడా దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఎటువంటి ఆధారాలు లేకుండానే భారత హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని ఆ దౌత్యాధికారికి స్పష్టం చేసినట్లు వెల్లడించింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు ట్రూడో ప్రభుత్వం ఇస్తున్న మద్దతుకు ప్రతిస్పందనగా తగిన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని పేర్కొంది. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును కెనడా అనుమానితుల జాబితాలో చేర్చింది. వీటిని తప్పుపట్టిన భారత్... ఈ ఆరోపణలు కెనడా ప్రభుత్వపు ఓటు బ్యాంకు రాజకీయాలకు అద్దం పడుతున్నాయని తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే భారత్‌లోని కెనడా రాయబారి స్టీవర్ట్ వీలర్‌కు సమన్లు జారీచేసింది.

మేం విచారించం... హైకోర్టుకు వెళ్లండి: సుప్రీం



న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఐదుగురు ఎమ్మెల్యేలను నామినేట్ చేసేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రతిపాదించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ముందుగా హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత రవీంద్ర కుమార్ శర్మ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వి విచారణకు హాజరయ్యారు. ఎన్నికల తీర్పుకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున తర్వాతైనాగానీ మీ వద్దకు రానివ్వండి అని న్యాయస్థానానికి సింఘ్వి విజ్ఞప్తి చేశారు. అయితే ఈ వ్యవహారాన్ని తాము విచారించమని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. మొదట్లోనే సుప్రీంకోర్టు విచారణ చేపడితే అనేక విషయాలు మరుగున పడిపోతుండటాన్ని గమనించాం కాబట్టే హైకోర్టుకు వెళ్లమని సూచిస్తున్నామని జస్టిస్ ఖన్నా అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.